TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
# హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:26 FRIDAY , JUNE 5 ,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 26 శుక్రవారం 5 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

## ఏదో ఒక రోజు ఆయన్ను కలుస్తా.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

హంసకలం వార్త జూన్ 04

పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఏదో ఒక రోజు ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీని కలుస్తానన్నారు. ఇప్పటివరకు మొజ్తాబాను కలిసే అవకాశం రాలేదని చెప్పిన ట్రంప్.. ఆయన పాలనాతీరు ఏమీ బాగాలేదని, చాలా విషయాలలో వెనుకబడి ఉన్నారని విమర్శించారు. - మిగతా2లో



## మమతకు భారీ షాక్: బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

- టీఎంసీలో తీవ్రరూపం దాల్చిన సంక్షోభం
- ప్రతిపక్ష నేతగా రెబల్ ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీకి గుర్తింపు
- బీజేపీతో టచ్‌లో 20 మంది టీఎంసీ ఎంపీలు ఉన్నట్లు ఊహాగానాలు
- మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పై అసంతృప్తితోనే తిరుగుబాటు
- బెంగాల్‌లో పార్టీ కమిటీలన్నింటినీ రద్దు చేసిన టీఎంసీ



2

## భూముల ధరల పెంపు: మంత్రి పొంగులేటి



హంసకలం వార్త జూన్ 04

మార్కెట్ వ్యాల్యూ ప్రకారం భూముల ధరలు శుక్రవారం నుంచి పెరుగుతాయని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. భూముల ధరలు ఏరియాను బట్టి 50 నుంచి100 శాతం పెరుగుతాయని తెలిపారు. ప్రైమ్ ఏరియాలో 100 శాతం పెరుగుతాయన్నారు. గురువారం హైదరాబాద్ లోని సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విలేకర్లతో మాట్లాడారు. భూముల వ్యాల్యూ పెరగటంతో రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 1200 నుంచి రూ. 1400 కోట్ల మేర ఆదాయం - మిగతా2లో

## వ్యవసాయ శాఖ ఆస్తుల రక్షణకు ఐఏఎస్‌లతో కమిటీ: మంత్రి తుమ్మల



హంసకలం వార్త జూన్ 04

వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులను ముందుగానే సన్నద్ధం చేయాలని ఉన్నతాధికారులను వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లో వ్యవసాయ, ఉద్యానవన శాఖ ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమీక్ష నిర్వహించారు. ఎల్– నినో ప్రభావంతో ప్రత్యామ్నాయ పంటల సాగు పై గ్రామసభల్లో రైతులకు అవగాహన - మిగతా2లో

## సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్, రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

హంసకలం వార్త జూన్ 04

తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న సస్పెండెడ్ అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు ను అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అరెస్ట్ చేసింది. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో ఆయనను నిన్న అరెస్ట్ చేసి, కోర్టు లో హాజరుపరచగా న్యాయ స్థానం జ్యుడీషియల్ రిమాండ్ - మిగతా2లో



## రూపాయి కూడా తేలేదు: కిషన్ రెడ్డి, బండి సంజయ్ ల పై కడియం శ్రీహరి ఫైర్



హంసకలం వార్త జూన్ 04

కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తన క్యాంప్ ఆఫీస్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడిన ఆయన.. కేంద్ర మంత్రులు ఇద్దరూ తెలంగాణ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా అదనంగా తీసుకురాలేదని, వారి వల్ల రాష్ట్రానికి ఎలాంటి - మిగతా2లో

## విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక




2

- ఇమ్మిగ్రేషన్ చట్టం 2025 ప్రకారం పోలీసుల తాజా అడ్వైజరీ
- నిబంధనలు పాటించని యజమానులు, విద్యాసంస్థలపై కఠిన చర్యలు
- విదేశీయుల కదలికల పై నిఘా పెంచడమే లక్ష్యమన్న పోలీసులు
- హోటళ్లు, హాస్టళ్లు, ఇంటి యజమానులందరికీ ఈ నిబంధన వర్తింపు

## తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు: రాంచందర్ రావు

హంసకలం వార్త జూన్ 04

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మీటింగ్‌కి అనుమతి ఇస్తే ఏమవుతుంది..? అని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు ప్రశ్నించారు.తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదని అన్నారు. గురువారం హైదరాబాద్ వేదికగా రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. - మిగతా2లో



## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

హంసకలం వార్త జూన్ 04

చంచల్‌గూడ కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈరోజు ములాఖత్‌లో కలిశారు. కేటీఆర్‌తో పాటు పార్టీ - మిగతా2లో



# వ్యవసాయ శాఖ ఆస్తుల రక్షణకు ఐఏఎస్‌లతో కమిటీ: మంత్రి తుమ్మల

-మొదటిపేజీ తరువాయి

కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తక్కువ నీటితో పంటల సాగు చేసేలా రైతులను ప్రోత్సహించాలని అధికారులకు స్పష్టం చేశారు. పంట వ్యర్థాలను కాల్చడంపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అందుకోసం అన్ని జిల్లాల్లో శాటిలైట్ ఆధారిత పంట వ్యర్థాల కాల్చివేతలపై పర్యవేక్షణ చేస్తున్నట్లు చెప్పారు. వీటిని నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. కొహెడ అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు వేగవంతం చేసినట్లు చెప్పారు. రూ. 2,284.32 కోట్లతో కొహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్ నిర్మాణం చేస్తున్నట్లు వివరించారు. జూన్ 6వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరుగుతుందన్నారు. ఇక వ్యవసాయశాఖకు చెందిన ఖాళీ భూముల పరిరక్షణకు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తామన్నారు. ఈ ఆస్తుల రక్షణ కోసం ఐఏఎస్ అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఖాళీ స్థలాల్లో ప్లాంటేషన్ లేదా లీజు ద్వారా ఆదాయం సమీకరణ చేయాలని మంత్రి పొంగులేటి సూచించారు. తెలంగాణ ప్రభుత్వానికి చెందిన ఫెర్టిలైజర్ యాప్‌కు కేంద్ర ప్రభుత్వం మరోసారి ప్రశంసలు కురిపించిందని చెప్పారు. తెలంగాణ ఎరువుల పర్యవేక్షణ విధానం దేశానికి ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు. కేంద్ర ఫెర్టిలైజర్ యాప్ అమలుకు తెలంగాణను పైలట్ రాష్ట్రంగా ఎంపిక చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. యాప్ సమర్థ అమలుకు రాష్ట్రానికి ప్రోత్సాహకాలు అందిస్తామని కేంద్రం హామీ ఇచ్చిందని మంత్రి పొంగులేటి గుర్తు చేశారు. జూన్ 4, 6, 8, 10 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించాలని ఉన్నతాధికారులను మంత్రి ఆదేశించారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణ సిబ్బంది సేవలు అందించాలని వారికి మంత్రి పొంగులేటి సూచించారు.

# భూముల ధరల పెంపు: మంత్రి పొంగులేటి

-మొదటిపేజీ తరువాయి

వస్తుందని చెప్పారు. హయ్యర్ సైడ్ ఏరియాలు శేరిలింగంపల్లి, రాజేందర్ నగర్, ఖాజాగూడ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ ఛార్జీలు పెరగవన్నారు. ఆయా ప్రాంతాల్లో ఛార్జీలు పెంచే ఆలోచన ప్రభుత్వానికి లేదని తెలిపారు. ఇక నుంచి సబ్ రిజిస్ట్రర్లకు ఫుల్ పవర్స్ కట్ చేశామని.. వారికి మినిమమ్ పవర్స్ మాత్రమే ఉంటాయని మంత్రి పొంగులేటి వివరించారు. భూ సేకరణ సమయంలో ప్రభుత్వానికి కొంత నష్టం జరిగిందన్నారు. కానీ రైతులకు మాత్రం లాభం జరుగుతుందన్నారు. ఇన్నర్ సైడ్ ఎకరం కనీసం రూ.15 లక్షలు ఉందని చెప్పారు. లోయర్ సైడ్ ఏమైనా పొరపాటు జరిగితే మార్పులు చేర్పులు ఉంటాయని చెప్పారు. హయ్యర్ సైడ్ మాత్రం మార్పులు ఉండవన్నారు. సమస్యలు ఉంటే.. హెల్ప్ డెస్క్ ఫోన్ నెంబర్ ఏర్పాటు చేస్తామని పబ్లిక్‌కు ఆయన సూచించారు. త్వరలో తహసీల్దార్ల బదిలీలు ఉంటాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీని రద్దు చేసి అవకాశమే లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ విషయంలో.. తెలంగాణను మిగతా రాష్ట్రాలు మోడల్‌గా తీసుకుంటున్నాయని గుర్తు చేశారు. ఏడాదిన్నరలో 90 శాతం గ్రామాల సర్వే పూర్తవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రెవెన్యూలో అవినీతి లేకుండా చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ఆ క్రమంలోనే అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) ట్రాప్‌లు అధికంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తాను వచ్చాక ఏసీబీ ట్రాప్ అయిన ఫైల్స్ అన్ని క్లియర్ చేశానని తెలిపారు. గత ప్రభుత్వంలో మూడేళ్లు రెవెన్యూ ఫైల్స్ పెండింగ్‌లో ఉన్నాయని గుర్తు చేశారు. కానీ తాను వచ్చిన మూడు నెలల్లోనే 3,500 రెవెన్యూ ఫైల్స్ క్లియర్ చేశానని వివరించారు. అసెంబ్లీలో పెండింగ్‌లో ఉన్న 10 ఏళ్ల ఫైల్స్ ఆరు నెలల్లోనే క్లియర్ చేసినట్లు చెప్పారు. తనకు ఏ శాఖ కేటాయించినా.. కళ్లు మూసికొని పని చేస్తానని పేర్కొన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మంచి జరిగే ఏ పని చేయడానికైన తాను భయపడనని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుండబద్దలు కొట్టారు. ఇప్పటి వరకు ఇందిరమ్మ ఇండ్లకు రూ. 7 వేల కోట్లు చెలించామని చెప్పారు. రాష్ట్రంలో పాడి ప్రోక్యూర్‌మెంట్ 90 శాతం పూర్తయిందన్నారు. అసైన్డ్ భూములకు పాలసీ తీసుక వస్తామని స్పష్టం చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసైన్డ్ భూములకు రిజిస్ట్రేషన్లు జరిగినవని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం వాటిని నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చిందని మంత్రి పొంగులేటి వివరించారు.

# ఏదో ఒక రోజు ఆయన్ను కలుస్తా.. ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు

-మొదటిపేజీ తరువాయి

'నేను మొజ్తాబా ఖమేనీని కలవాలనుకుంటున్నాను. అదంతా ఎలా కుదురుతుందో తెలీదు. కానీ ఏదో ఒక రోజు మేమిద్దరం కలుస్తాం' అని ఓ మీడియా ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండకూడదని ఇప్పటికే అంగీకరించిందని.. అమెరికాతో చర్చల్లో ఖమేనీ పాల్గొంటున్నారని చెప్పుకొచ్చారు ట్రంప్.

**అందుకే అలా అన్నా..**

లెబనాన్ విషయంలో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూతో తీవ్ర వాగ్వాదం జరిగినట్లు ట్రంప్ అంగీకరించారు. లెబనాన్‌తో ఇజ్రాయెల్ చేస్తున్న పోరాటం పట్ల తాను సంతోషంగా లేనని ఆయన చెప్పారు. నెతన్యాహు.. లెబనాన్‌తో నిత్యం దాడులకు దిగడంపై తాను కలత చెందానని.. అందుకే ఆ సమయంలో మాట తూలానన్నారు. కాగా.. ఇటీవల ఇజ్రాయెల్ ప్రెసిడెంట్ నెతన్యాహుతో ఫోన్‌లో.. 'నీకు పిచ్చి పట్టింది. నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేనే నిన్ను కాపాడుతున్నాను. ఇప్పుడందరూ నిన్ను, ఇజ్రాయెల్‌ను ద్వేషిస్తున్నారు' అని ట్రంప్ కోపంగా మాట్లాడినట్టు మీడియా కథనాలు నివేదించాయి. అయితే.. తనకు, నెతన్యాహుకు మధ్య మంచి సఖ్యత ఉందని ఆ అనుబంధాన్ని అగ్రరాజ్య అధ్యక్షుడు గుర్తుచేసుకున్నారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మళ్లీ చెలరేగిన నేపథ్యంలో ఇరాన్, అమెరికాల మధ్య సంప్రదింపులు దెబ్బతిన్నాయన్న వాదనలను ట్రంప్ ఖండించారు. కొన్ని రోజులుగా జోరుగా చర్చలు సాగుతున్నాయని ఆయన తన ట్రూత్ సోషల్ మీడియా వేదికగా పునరుద్ఘాటించారు. 'ఈ చర్చలు ఎక్కడికి దారితీస్తాయో తెలియదు. కానీ నేను చెప్పినట్లుగా ఇరాన్ ఏదో ఓ విధంగా ఒప్పందం చేసుకోవాల్సిన సమయం వచ్చింది' అని ట్రంప్ పేర్కొన్నారు.

# విదేశీయుల వివరాలు 24 గంటల్లో ఇవ్వాలి: హైదరాబాద్ పోలీసుల హెచ్చరిక

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ నగరంలో బస చేసే విదేశీయుల వివరాలను 24 గంటల్లోగా తమకు తెలియజేయాలని నగర పోలీసులు స్పష్టం చేశారు. ఈ మేరకు ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ యాక్ట్, 2025 ప్రకారం యజమానులకు, విద్యాసంస్థలకు తాజా అడ్వైజరీ జారీ చేశారు. నిబంధనలు పాటించని పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోల్కొండ జోన్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) జూన్ 3న ఈ సూచనలు జారీ చేశారు. హోటళ్లు, లాడ్జీలు, గెస్ట్ హౌస్‌లు, అద్దె ఇళ్ల యజమానులు, ఆసుపత్రులు, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సహా విదేశీయులకు ఆశ్రయం కల్పించే వారందరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. విదేశీ పాస్‌పోర్ట్ హోల్డర్లు, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డు ఉన్నవారు, నేపాల్ జాతీయులతో సహా ఏ విదేశీయుడు తమ ప్రాంగణంలో బస చేసినా, నిర్దేశిత ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫారం-III (ఫారం-సి) సమర్పించాలి. విద్యాసంస్థలు విదేశీ విద్యార్థుల వివరాలను ఫారం-IIలో నమోదు చేయాలి. వారు తిరిగి వెళ్లిన వివరాలను కూడా రిపోర్ట్ చేసి, ఆ రికార్డులను కనీసం ఏడాది పాటు భద్రపరచుకోవాలి. 2025 సెప్టెంబర్‌లో అమల్లోకి వచ్చిన కొత్త ఇమ్మిగ్రేషన్ చట్టం అమలులో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నట్టు పోలీసులు తెలిపారు. దేశంలో విదేశీయుల కదలికలపై పర్యవేక్షణను పటిష్టం చేయడమే దీని లక్ష్యం. తప్పుడు సమాచారం ఇచ్చినా లేదా వాస్తవాలను దాచిపెట్టినా చట్ట ప్రకారం శిక్షార్హులవుతారని స్పష్టం చేశారు. ఎలాంటి చట్టపరమైన చిక్కులు రాకుండా ఉండేందుకు అందరూ ఈ నిబంధనలను కచ్చితంగా పాటించాలని పోలీసులు కోరారు.

# తెలంగాణకు వ్యతిరేకంగా.. పవన్ ఎప్పుడూ మాట్లాడలేదు: రాంచందర్ రావు

-మొదటిపేజీ తరువాయి

పవన్ కల్యాణ్.. జనసేన సభ కోసం అనుమతి అడిగారని... ఇచ్చి ఉంటే కథ అక్కడే ముగిసేదని.. సభకు అనుమతి ఎందుకు ఇవ్వలేదో కాంగ్రెస్ సర్కార్ చెప్పాలని రాంచందర్ రావు ప్రశ్నించారు. ఈ సమావేశం పెట్టుకోవడం ప్రతి ఒక్కరి ప్రజాస్వామ్య హక్కు అని చెప్పారు. దాన్ని అడ్డుకోవడమే ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. పవన్ కల్యాణ్ అంశాన్ని బీజేపీ మీద రుద్దే ప్రయత్నం చేయడం రాజకీయ దివాళాకోరుతనమని ధ్వజమెత్తారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ కలిస్తేనే కొందరి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు.

**నిజాలు మాట్లాడాలి..**

తెలంగాణ సెంటిమెంట్ పేరుతో మళ్లీ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని రాంచందర్ రావు ఆగ్రహించారు. తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడిన వారితో చేతులు కలిపింది ఎవరో..? బీఆర్ఎస్ నేతలు చెప్పాలని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొనని శక్తులతో అధికార రాజకీయాలు చేసింది ఎవరు..? అని నిలదీశారు. తెలంగాణను తిట్టిన వారిని, ఉద్యమకారులను అవమానించిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చి పదవులు ఇచ్చింది ఎవరు..? అని ప్రశ్నించారు. తెలంగాణ పేరుతో రాజకీయాలు చేసే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి ప్రజలకు గుర్తు చేయాలని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవం మీద ప్రేమ ఉంటే డ్రామాలు కాదని... నిజాలు మాట్లాడాలని సవాల్ విసిరారు. ప్రజలు ఇప్పుడు భావోద్వేగాలకు కాదని, మీ గతానికి కూడా లెక్క అడిగే స్థితిలో ఉన్నారని పేర్కొన్నారు.

**వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారు..**

తెలంగాణను వ్యతిరేకించిన వారికి కేసీఆర్ హయాంలో మంత్రి పదవులు ఇచ్చారని రాంచందర్ రావు ఆగ్రహించారు. ఏపీలో బీఆర్ఎస్ ఆఫీస్ పెట్టలేదా..? అని ప్రశ్నించారు. తెలంగాణ నిధులను పంజాబ్‌లో కేసీఆర్ పంచలేదా..? అని నిలదీశారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించలేని పరిస్థితిలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఉందని విమర్శించారు. బీజేపీ సపోర్ట్ చేయడంతోనే తెలంగాణ వచ్చిందని పేర్కొన్నారు.

**జాబ్ క్యాలెండర్ ఏమైంది..?**

కాంగ్రెస్ సర్కార్ ఇస్తానని చెప్పిన జాబ్ క్యాలెండర్ ఏమైంది..? అని రాంచందర్ రావు ప్రశ్నించారు. 12 ఏళ్ల నుంచి నీళ్ల మీద ఒక పాలసీ కూడా ఎందుకు తేలేదని నిలదీశారు. తెలంగాణకు రావాల్సిన నీళ్ల వాటా కంటే తక్కువ వాటాను కేసీఆర్ ఒప్పుకున్నారని ప్రస్తావించారు. రాష్ట్రానికి రావాల్సిన కృష్ణా జలాలను డీకే శివకుమార్‌కి.. రేవంత్‌రెడ్డి బహుమతిగా ఇచ్చారని విమర్శించారు. మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణను అప్పుల్లోకి నెట్టారని ధ్వజమెత్తారు. తెలంగాణ రాజకీయాల్లో బీజేపీ సూపర్ హీరో అని రాంచందర్ రావు అభివర్ణించారు.

## మమతకు భారీ షాక్: బీజేపీ వైపు 20 మంది టీఎంసీ ఎంపీల చూపు!

-మొదటిపేజీ తరువాయి

పశ్చిమబెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) పార్టీ చరిత్రలోనే అతిపెద్ద సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత మొదలైన అసమ్మతి, ఇప్పుడు ఎమ్మెల్యేల తిరుగుబాటుతో తీవ్రస్థాయికి చేరింది. ఈ సంక్షోభం రాష్ట్రానికే పరిమితం కాకుండా, ఢిల్లీకి కూడా పాకింది. ఏకంగా 20 మంది లోక్‌సభ సభ్యులు పార్టీ మారేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు మమతా బెనర్జీకి కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. జూన్ 3న, పార్టీ నుంచి బహిష్కరణకు గురైన ఎమ్మెల్యే రితబ్రత బెనర్జీని ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ స్పీకర్ రతీంద్ర బోస్ గుర్తించారు. తమకు 58 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని రెబల్ వర్గం ప్రకటించింది. దీంతో అసెంబ్లీలో మమతా బెనర్జీ వర్గం బలహీనపడింది. మొత్తం 80 మంది టీఎంసీ ఎమ్మెల్యేలలో అధికశాతం మంది రెబల్ వర్గం వైపు ఉన్నారు. ఏప్రిల్-మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరపడిన తర్వాత ఈ సంక్షోభం మొదలైంది. ప్రతిపక్ష నేత ఎంపిక విషయంలో పార్టీ అధిష్టానం తీసుకున్న నిర్ణయాన్ని రెబల్ ఎమ్మెల్యేలు వ్యతిరేకించారు. మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ వ్యవహార శైలి, ఎన్నికల ఓటమి తర్వాత ఆయన పెత్తనం చెలాయించడమే ఈ తిరుగుబాటుకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. తామంతా మమతా బెనర్జీ నాయకత్వాన్ని గౌరవిస్తామని, కానీ అభిషేక్ పెత్తనాన్ని సహించబోమని రెబల్ ఎమ్మెల్యేలు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో, సుమారు 20 మంది టీఎంసీ ఎంపీలు బీజేపీ నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.

## సస్పెండెడ్ ఏఎస్పీ భుజంగరావు అరెస్ట్, రూ.100 కోట్లకు పైగా ఆస్తుల గుర్తింపు

-మొదటిపేజీ తరువాయి

దీంతో అధికారులు ఆయన్ను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. నిన్న ఉదయం నుంచి ఏసీబీ అధికారులు భుజంగరావుతో పాటు ఆయన బంధువులు, సన్నిహితులకు చెందిన సుమారు 15 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. హైదరాబాద్‌లోని హఫీజ్‌పేట, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లో ఈ తనిఖీలు జరిగాయి. ఈ సోదాల్లో రూ.5.92 కోట్ల విలువైన ఆస్తులకు సంబంధించిన పత్రాలను గుర్తించినట్లు ఏసీబీ అధికారులు అధికారికంగా ప్రకటించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల్లో 27.29 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లో రెండు ఇళ్లు, ఐదు ఓపెన్ ప్లాట్లు, ఒక వాణిజ్య భవనం ఉన్నాయి. వీటితో పాటు రూ.3.83 లక్షల నగదు, కిలో బంగారం, రెండు కార్లను కూడా గుర్తించారు. ఈ ఆస్తుల డాక్యుమెంట్ విలువ రూ.5.92 కోట్లుగా ఉన్నప్పటికీ, బహిరంగ మార్కెట్‌లో వీటి విలువ రూ.100 కోట్లకు పైగా ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. భుజంగరావు ఇంట్లో 29 మద్యం సీసాలు లభించడంతో, ఆ విషయాన్ని ఎక్సైజ్ శాఖకు నివేదించినట్లు ఏసీబీ తెలిపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఇతర ప్రముఖుల ఫోన్లను అక్రమంగా ట్యాపింగ్ చేశారన్న ఆరోపణలపై నమోదైన కేసులో భుజంగరావు నిందితుడిగా ఉన్నారు. ఈ కేసులో ఆయనను 2024 మార్చిలో అరెస్ట్ చేయగా, తర్వాత తెలంగాణ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తాజాగా అక్రమాస్తుల కేసు నమోదు కావడంతో ఏసీబీ ఆయన్ను మరోసారి అరెస్ట్ చేసింది. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు.

## రూపాయి కూడా తేలేదు: కిషన్ రెడ్డి, బండి సంజయ్ లపై కడియం శ్రీహరి ఫైర్

-మొదటిపేజీ తరువాయి

ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల దశాబ్దాల కల అయిన 'కాజీపేట రైల్వే డివిజన్'ను తక్షణమే ఏర్పాటు చేయాలని శ్రీహరి కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. ఈ డివిజన్ ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతంలో పారిశ్రామిక వృద్ధి పెరగడమే కాకుండా, స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన స్పష్టం చేశారు. గత 12 ఏళ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తెలంగాణను ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యం చేస్తోందని.. అసలు ప్రధాని మోదీకి, బీజేపీకి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఇష్టం లేదని ఆరోపించారు. కేంద్ర మంత్రులు కేవలం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని, బండి సంజయ్ చెబుతున్న రూ.13 లక్షల కోట్ల నిధుల్లో రాష్ట్రానికి వచ్చిన ప్రాజెక్టులు ఏవో శ్వేతపత్రం విడుదల చేయాలని సవాల్ విసిరారు. ఇదే సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీరును కూడా శ్రీహరి తప్పుపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేటీఆర్ వాడుతున్న భాష ఏమాత్రం సమర్థనీయం కాదన్నారు. ఆయనకు నాయకత్వ లక్షణాలు లేవనే విషయాన్ని స్వయంగా ఆయన సోదరే (కవిత) గతంలో చెప్పిన విషయాన్ని గుర్తుంచుకోవాలి" అని వ్యాఖ్యానించారు.

## చంచల్‌గూడ జైల్లో బాల్క సుమన్‌ను కలిసిన కేటీఆర్

-మొదటిపేజీ తరువాయి

జైల్లో ఉన్న సుమన్‌కు పార్టీ పూర్తి అండగా ఉంటుందని ఈ సందర్భంగా కేటీఆర్ భరోసా ఇచ్చారు. సింగరేణి కాలరీస్ ఆస్తులను ధ్వంసం చేయాలంటూ, రైలు పట్టాలు కోసేయాలంటూ బాల్క సుమన్ ఇటీవల రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆయనపై నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ తర్వాత ఈ కేసును బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. గడిచిన మే 26న తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ నిర్వహించిన బహిరంగ సభలో బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని పేర్కొంటూ.. సింగరేణి కాలరీస్‌కు చెందిన జూనియర్ అసిస్టెంట్ ఆనంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ అరెస్ట్ చర్యలు చేపట్టారు.


# సంపాదకీయం

## 'ప్రత్యేక' చట్టాలపై హర్షించదగ్గ తీర్పు

'బెయిలు నియమం, జైలు మినహాయింపు' ఇది న్యాయసిద్ధాంత ప్రాథమిక సూత్రాలలో ఒకటి. ఒక ప్రజాస్వామిక, రాజ్యాంగబద్ధ వ్యవస్థలో ఇది తప్పక పాటించవలసిన సూత్రం. అయితే గత దశాబ్ద కాలంలో ఈ సూత్రానికి న్యాయస్థానాలే చెల్లుచీటీ పాడిన పరిస్థితి ఏర్పడింది. దానికి ఒక కారణం వివిధ ప్రత్యేక చట్టాలు. యూఏపీఏ, ఎన్‌డీపీఎస్, పీఎంఎల్‌ఏ లాంటి దేశ భద్రత, ఆర్థిక భద్రత పేరు మీద తీసుకువచ్చిన చట్టాలలో 'జైలు నియమం, బెయిలు మినహాయింపు' అనే తలక్రిందుల సూత్రం అంతర్భాగంగా ఉంది. న్యాయవ్యవస్థ మొత్తం ఇదే సూత్రాన్ని అనుసరిస్తూ వచ్చింది. ఉన్నత న్యాయస్థానాలు అక్కడక్కడా దుర్వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ వచ్చినా, మొత్తం మీద ఈ సూత్రం ఆధారంగా ఖైదీలు సంవత్సరాలకు సంవత్సరాలు విచారణ లేకుండా, బెయిలు రాకుండా కారాగారాలలో మగ్గిపోయే పరిస్థితి ఏర్పడింది. అలా మగ్గిపోతున్న వ్యక్తులలో ప్రముఖంగా వినిపించే పేర్లు ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్. ట్రైల్ కోర్ట్, దిల్లీ హైకోర్ట్, అలాగే సుప్రీంకోర్ట్ కూడా యూఏపీఏ (ఉపా) చట్టాన్ని ఆధారం చేసుకుని వీరికి ఆరు సంవత్సరాలుగా పలుమార్లు బెయిలు నిరాకరించాయి. అయితే, మే 18న సయ్యద్ ఇఫ్తికార్ అంద్రాబీ వర్సెస్ నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ, జమ్మూ కేసులో ఇరువురు సభ్యుల ధర్మాసనం ఇటువంటి చట్టాల కింద పెట్టిన కేసులలో బెయిలు ఇవ్వకపోవటాన్ని తప్పుబడుతూ, సుప్రీంకోర్ట్ కూడా అలా నిరాకరించడాన్ని కఠినంగా విమర్శించింది. సుప్రీంకోర్ట్ కానీ హైకోర్ట్ కానీ తాము ఇచ్చిన తీర్పును తామే ఈ విధంగా తప్పుబట్టడం బహు అరుదుగా జరిగే విషయం. సయ్యద్ ఇఫ్తికార్ అంద్రాబీ అనే వ్యక్తి కశ్మీర్‌లో ప్రభుత్వ ఉద్యోగి, జమ్మూ కశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ పార్టీ కార్యకర్త. అతను ఉగ్రవాద సంస్థ సభ్యుడనీ, వారికి నిధులు సమకూర్చడానికి మాదకద్రవ్యాలు సరఫరా చేస్తున్నాడనీ ఆరోపిస్తూ జమ్మూ కశ్మీర్ పోలీసులు యూఏపీఏ, ఎన్‌డీపీఎస్ చట్టాల క్రింద 2020లో కేసు నమోదు చేసి అతడిని అరెస్ట్ చేశారు. ఆ తరువాత ఈ కేసు నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్‌ఐఏ) పరిధిలోకి వెళ్ళింది. 2024లో ఈయన బెయిలు పిటిషన్‌ను ట్రైల్ కోర్ట్ కొట్టివేసింది, 2025లో హైకోర్ట్ ఆ తీర్పును సమర్థించింది. ఆ తరువాత ఈ కేసు సుప్రీంకోర్ట్‌కు వచ్చింది. సుప్రీంకోర్ట్‌కు వచ్చేనాటికి ఈ వ్యక్తి ఏ విచారణా లేకుండా ఐదేళ్ళుగా జైలులోనే ఉండిపోయాడు. సుప్రీంకోర్ట్ అతనికి బెయిల్ మంజూరు చేసింది. ఈ తీర్పులో ఇరువురు సభ్యుల ధర్మాసనం చెప్పిన ఒక ముఖ్య విషయం: "బెయిలు నియమం, జైలు మినహాయింపు" అనే సూత్రం యుఏపీఏ లాంటి ప్రత్యేక చట్టాలకు కూడా వర్తిస్తుంది అని. అది ఎంత ప్రత్యేకమైన చట్టమైనా రాజ్యాంగంలోని జీవించే హక్కుకు లోబడి ఉండాలని, ఇలా ఏళ్ల తరబడి విచారణ లేకుండా కారాగారంలో ఉంచడం ఆ జీవించే హక్కుకు, తద్వారా రాజ్యాంగానికి విరుద్ధం అని చాలా స్పష్టంగా తెలియజేసింది. న్యాయస్థానాలలో త్వరితగతిన విచారణ అనేది జీవించే హక్కులో భాగం అని సుప్రీంకోర్ట్ సూత్రీకరించి ఐదు దశాబ్దాలు అవుతున్నది. అయితే ఇప్పటికీ అదే విషయాన్ని మళ్లీ పునరుద్ఘాటించాల్సి రావడం, ఆ లోపల ఎంతోమంది జీవితాలు కారాగారాల్లోనే మగ్గిపోవటంలో ఏపాటి రాజ్యాంగబద్ధత ఉంది? ఒక పక్క విచారణ త్వరితగతిన అవ్వదు, మరొకపక్క ఇటువంటి ప్రత్యేక చట్టాల కారణంగా బెయిలు రాదు. వీటి మధ్యలో బలి అయ్యేది ప్రజలు, వారి ప్రాథమిక హక్కులు, రాజ్యాంగ సూత్రాలు. ఈ తీర్పులో ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించిన మరొక విషయం.. పెద్ద బెంచ్ ధర్మాసనం ఇచ్చిన తీర్పును చిన్న బెంచ్ ధర్మాసనం పాటించకపోవడం, వాటికి వ్యతిరేకంగా తీర్పులు ఇవ్వడం. 2021లోనే ముగ్గురు సభ్యుల ధర్మాసనం 'న్యాయస్థానంలో విచారణ జరగకపోయినా లేదా విచారణ పూర్తి అవ్వడానికి చాలా ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉన్నా కూడా నేరంతో, చట్టంతో సంబంధం లేకుండా బెయిల్ పొందే హక్కు ఉంది' అనే స్పష్టమైన తీర్పు ఇచ్చింది. 'అది ఒక హక్కుగా దఖలుపడుతుంది' అని తేల్చి చెప్పింది. దానికి అనుగుణంగా తరువాత కొన్ని కేసులలో ప్రత్యేక చట్టాల కింద అరెస్ట్ అయినవారికి బెయిల్ ఇచ్చారు కూడా. అయితే అదే హక్కును ఇరువురు సభ్యుల ధర్మాసనం ఉమర్ ఖలీద్, షర్జీల్ ఇమామ్‌కు నిరాకరించింది. అంటే సుప్రీంకోర్ట్ నిర్ణయాన్ని ఏ అధికారం లేకపోయినా కూడా సుప్రీంకోర్టే తిరగదోడింది. ఇది చట్టబద్ధం కాదు, న్యాయం అసలే కాదు. ఇదే విషయాన్ని ఈ తీర్పులో కూడా న్యాయమూర్తులు గట్టిగా వెల్లడించారు. ఇటువంటి ప్రత్యేక చట్టాల కింద న్యాయస్థానాలలో దోష నిర్ధారణ శాతం ఎంత తక్కువగా ఉన్నదో అన్న విషయాన్ని ఇదే తీర్పు సంఖ్యలతో సహా వెల్లడించింది. యూఏపీఏ చట్టాన్ని ఉదాహరణగా తీసుకున్న ధర్మాసనం 2019--2024 మధ్యలో ఈ చట్టం కింద దోష నిర్ధారణ శాతం దేశవ్యాప్తంగా ఏనాడూ 6శాతాన్ని దాటలేదని, అదే జమ్మూ కశ్మీర్‌లో అయితే ఈ ఐదు సంవత్సరాలలో ఏనాడూ 1శాతం కూడా దాటలేదని తెలియజేసింది. అంటే ఈ చట్టం ప్రకారం శిక్ష పడటం అనేది అత్యంత అరుదు. అటువంటప్పుడు ఖైదీలు ఎందుకు అనేక సంవత్సరాలు జైళ్లలో మగ్గిపోవాలి? నిజానికి ఈ చట్టం ఆధారంగా విచారించడానికి ప్రత్యేక న్యాయస్థానాలు ఉండాలన్న నియమం ఉంది. ఆ న్యాయస్థానాలను నేటి వరకూ ఏర్పాటు చేసింది లేదు. ఉదాహరణకు ఎన్‌ఐఏ కేసులకు ప్రత్యేక న్యాయస్థానాలు ఉండాలని ఆ చట్టం చెబుతోంది. అయితే ఆ చట్టం వచ్చి 18 సంవత్సరాలు అవుతున్నప్పటికీ, ఆ ప్రత్యేక న్యాయస్థానాలు ఏర్పాటు కాలేదు. సాధారణ న్యాయస్థానాలకే ఈ కేసులు అప్పగిస్తున్నారు. దాని కారణంగా విచారణ నత్తనడకన సాగుతుంది. ఇటువంటి ప్రభుత్వ, న్యాయవ్యవస్థ వైఫల్యాలకు మూల్యం చెల్లిస్తున్నది మాత్రం ఈ చట్టం కింద నేరస్థులుగా ముద్ర పడినవారు. తమ నేరం నిరూపణ అవ్వకుండానే నేరం నిరూపణ అయితే ఎంత కాలం శిక్ష పడుతుందో అంత కాలం కారాగారంలో ఉండవలసిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఈ తీర్పులో కూడా ధర్మాసనం ఇదే విషయాన్ని ఎత్తిచూపింది. విచారణ పేరుతో సుదీర్ఘకాలం జైలులో ఉంచటం అంటే వారి నేరం రుజువు కాకముందే వారికి శిక్ష విధించడంతో సమానమని చెప్పింది.ఒక ప్రజాస్వామిక సమాజంలో యూఏపీఏ వంటి ప్రత్యేక చట్టాలకు చోటే ఉండకూడదు. ఇవి అనాగరికమైనవి, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనవి, జవాబుదారీతనం లేనివి. అయితే అవి అమలులో ఉన్నన్ని రోజులు కూడా వాటి దుర్వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ అడపాదడపా ఇచ్చే తీర్పులను స్వాగతించాలి. అలాగే ఈ సుప్రీంకోర్టు తీర్పును కూడా హర్షించాలి.

# నైరాశ్య యువత నవీన తిరుగుబాటు







'మాట మాటకు మందు దూరంలా/ మేం సాగుతాం/ మేం రేగుతాం'.. అంటూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ/ బొద్దింకల జనతా పార్టీ) 'ఝుంఝూనిల షడ్జధ్వానం' చేసింది. సీజేపీ ఒక డిజిటల్ దృగ్విషయం. నిరుద్యోగ యువతను 'పరాన్న జీవులు', 'బొద్దింకలు'తో పోలుస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ప్రజ్వరిల్లిన ఆన్‌లైన్ ధిక్కారమది. కనుకనే అపూర్వ సంచలనం సృష్టించింది. అయితే ఆ సంచలనానికి ప్రతిస్పందనలు చాలావరకు స్పష్టంగా కనిపిస్తున్న ఒక సామాన్య సత్యాన్ని గమనించనే లేదు! సీజేపీ ఒక సంప్రదాయ రాజకీయ పార్టీ కాదు. అది ప్రజానీకం కంటే ఎక్కువా కాదు, తక్కువా కాదు. అది ఒక సమాజమూ కాదు. ఒక గుంపు కూడా కాదు, అదొక భావోద్వేగాల సముదాయం. ఒక ఉద్యమ స్థాయికి చాలా చాలా దూరంగా ఉన్నది. అది కేవలం ఒక ప్రభంజన సందర్భం. ఎటువంటి ప్రభంజనమది? 'ఒక్క క్షణంలో/ మనస్సులో స్ఫృతి/ తటిన్మణి'పించిన ప్రభంజనమది. 'మతి వికాసిస్తుంది' సందేహం లేదు. అధికార నియంతృత్వ దాడి నుంచి మన ప్రజాస్వామిక గణతంత్రాన్ని కాపాడుకోవాల్సిన కర్తవ్యాన్ని నిర్దేశించడమే కాకుండా అందుకు అవసరమైన సంకల్పశక్తిని సమకూర్చిన ప్రభంజన క్షణమది. అందుకే అది ముఖ్యమైనది. ఎట్టి పరిస్థితులలోనూ కొట్టివేయకూడనిది. అలా చేయడమంటే దేశ రాజకీయ వాస్తవాలను విస్మరించడమే అవుతుంది. ఆ ప్రభంజనం ఒక అల కాదు, ఒక రాజకీయ అంతర్వాహిని, ఆగ్రహ రాజకీయ అంతర్వాహిని (అల అనేది పెద్ద శబ్దంతో, కంటికి కనిపించేదిగా, తాత్కాలికమైనదిగా ఉంటుంది. అది త్వరగా విరుచుకుపడి, అంతరిస్తుంది. అలకు భిన్నంగా అంతర్వాహిని అనేది ఉపరితలం కింద నుంచి ప్రభావం చూపే శక్తిమంతమైన, నిశ్శబ్దమైన, స్థిరమైన కదలిక). ప్రాకృతిక ప్రభంజనాలనే కాదు, రాజకీయ, సామాజిక ప్రభంజనాలనూ పట్టుకోవడమనేది అసాధ్యం. సీజేపీ అనే ప్రభంజనాన్ని నియంత్రించాలనేది ఒక మూర్ఖపు ఆలోచన. మరింత ముఖ్యమైన విషయమేమిటంటే ఆ ప్రభంజనం దేశ రాజకీయ వాతావరణంలో, పాలనా వ్యవస్థలో ఒక మౌలిక మార్పును ఆశించింది. అటువంటి మార్పును అడ్డుకోవడానికి మొండిగా ప్రయత్నించడం వివేకవంతం కానేకాదు. ారీ మెజారిటీతో అధికారానికి వచ్చిన ప్రభుత్వాలు తమ పదవీ మధ్యకాలంలో సంక్షోభాల పాలవడం ఒక సాధారణ రాజకీయ పరిణామం. ఊహించని రీతిలో నిరసనోద్యమాలు ప్రజ్వరిల్లి అధికారపు చీకటి కోణాన్ని బహిర్గతం చేస్తాయి. 1973--74లో గుజరాత్, బిహార్ ఉద్యమాలు, 1983లో అసోం ఉద్యమం, 2012లో అన్నాహజారే ఉద్యమం, 2021లో కిసాన్ మోర్చా ఉద్యమం మొదలైనవన్నీ అజేయంగా కన్పించిన ప్రభుత్వాలను సవాల్ చేశాయి.. మార్పును సాధించాయి. ప్రతిపక్షాలు నిస్తేజం కావడంతో విద్యార్థులు, యువజనుల చొరవతో ఆ ఉద్యమాలు నిర్వహించి మార్పులు సాధించారు. ఆశయం దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ సంచలనం కూడా తొలి పరిశీలనలో అదే రీతి ఉద్యమంగా కన్పిస్తోంది. ఈ 'బొద్దింకల' ఉద్యమం అపూర్వ ప్రజా చైతన్యాన్ని సృష్టించడంలో చారిత్రకంగా ఇతర సమాంతర ఉద్యమాల కంటే మరింత ప్రభావశీలమైనది.

అయితే ఆచరణీయమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని ప్రభవింపజేసేందుకు అవసరమైన శక్తిసామర్థ్యాలు దానికి కొరవడ్డాయి. ఎందుకని? ఈ డిజిటల్ ప్రతిఘటనలో పాల్గొన్నవారు చాలావరకు నిజ జీవిత రాజకీయ కార్యాచరణలో పాల్గొనడానికి సంసిద్ధంగా ఉన్న కార్యకర్తలు కారు. కాక్రోచ్ జనతా పార్టీ ప్రారంభదశలో ఉన్నది. ప్రభావవంతమైన రాజకీయ ప్రత్యామ్నాయాన్ని సృష్టించగల స్థితికి చాలా దూరంలో ఉన్నది. దానికొక సంస్థాపకుడు ఉన్నాడు. అయితే ఆ వ్యవస్థాపకుడు విధిగా ఒక ఆవశ్యక నాయకుడు కాదు. సీజేపీ అనుయాయుల్లో అత్యధికులు కేవలం ప్రేక్షకులు మాత్రమే. ఆందోళనల్లో అనుభవం లేనివారు. కేవలం ఉత్సాహం ఉంటే సరిపోతుందా? నిజ జీవితంలో రాజకీయ కార్యాచరణ కష్టనష్టాలను భరించి లక్ష్యసాధనకు కడదాకా సాగేందుకు సంకల్పిం చుకునేవారు ఎంతమంది ఉంటారు? పైగా వారు ఒక అనిర్దిష్ట విరోధికి వ్యతిరేకంగా పరస్పర విరుద్ధమైన ఫిర్యాదులు చేస్తున్నారు. ఉమ్మడిగా ఎదుర్కొంటున్న సమస్యలపై విభిన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే అవన్నీ ప్రజాస్వామ్య డిమాండ్లు, సందేహం లేదు. పాలకులు వాటిని విస్మరించినప్పుడు (ఇదే జరిగి తీరుతుంది) ఆందోళనకారులు తమ ఉమ్మడి శత్రువును గుర్తిస్తారు. వారి ఫిర్యాదులు ప్రజా డిమాండ్లుగా పరిణమిస్తాయి. సీజేపీ వంటి ప్రతి ప్రజా నిరసనోద్యమపు విశిష్ట లక్షణమది. ఆ ప్రత్యేకతే శక్తిమంతమైన, కార్యసాధక ఉద్యమాల నిర్మాణానికి అవసరమైన ప్రాతిపదికలను నిర్మిస్తుందని అర్జెంటీనా రాజకీయ తత్వవేత్త ఎర్నెస్టో లాక్లా (1935--2014) అన్నారు. నిరంకుశాధికార తత్వం అంతకంతకూ పెరిగిపోతున్న నేపథ్యంలో దానిని ఎదుర్కొనేందుకు 'సందిగ్ధ చర్య' (డైలమా యాక్షన్) మార్గాన్ని ఎంచుకోవడం సీజేపీకి మరింత విశిష్టతను సమకూర్చింది. నియంతృత్వ పాలకులను అహింసాత్మకంగా ప్రతిఘటించడంలో హాస్యం, ముందుగా ఊహించ వీలులేని పద్ధతిని అనుసరించడం చాలా కీలకమని సెర్బియన్ మేధావి, క్రియాశీలి పోపోవిక్ వాదిస్తారు. సోఫియా ఎ.మెక్ క్లెనెన్‌తో కలిసి ఆమె రాసిన 'ప్రాంక్‌స్టర్స్ వర్సెస్ ఆటోక్రాట్స్' అనే పుస్తకం నిరంకుశ ప్రభుత్వాలను ప్రతిఘటించేందుకు ప్రజా నిరసనోద్యమాలు హాస్యాన్ని, సందిగ్ధ చర్యలను ఉపయోగించుకున్న తీరుతెన్నులను విపులంగా వివరించారు. అటువంటి నిరసనోద్యమాలు నిరంకుశ పాలకులను సందిగ్ధంలో పడవేస్తాయి. ఎదుర్కోలేని సంకటాలను కలిగిస్తాయి. ఉద్యమకారుల సందిగ్ధ చర్యలను అనుమతిస్తే పాలకులు బలహీనులుగా కనిపిస్తారు. వాటిని అణచివేసిన పక్షంలో ప్రజల దృష్టిలో క్రూర, అసంబద్ధ పాలకులుగా నిలుస్తారు. సంప్రదాయ ప్రతిపక్షాలు విఫలమైన చోట ఈ వినూత్న నిరసనలు ప్రభావశీలంగా సఫలమవడం కద్దు. నిరంకుశాధికార పాలనపై పోరుకు బొద్దింకను ఒక మీమ్‌గా చేసిన కాక్రోచ్ జనతా పార్టీని అందుకొక స్పష్టమైన నిదర్శనంగా చెప్పవచ్చు. మన ప్రస్తుత రాజకీయ పరిస్థితులలో ప్రజాస్వామిక ప్రతిఘటనకు సీజేపీ, బహుశా అనుద్దేశపూర్వకంగానే ఒక ఆదర్శప్రాయ సందిగ్ధ చర్యను ప్రతిపాదించింది. 'బొద్దింకల ఉద్యమం' ఒక వినూత్న నిరసన రీతి. అంతేకాదు, అది వర్తమాన భారతదేశ రాజకీయ పరిస్థితులకు అద్దం పట్టింది. పాలకుల పట్ల ప్రజల్లో ముఖ్యంగా యువతలో గూడుకట్టుకున్న అసంతృప్తిని అది వ్యక్తం చేసింది. జాతీయ అధికార పక్షం రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయాలు సాధిస్తూ మరింతగా బలోపేతమవుతోన్నది. ఆ విజయాల గురించి ఆ అధికారపక్షం ఎంతగా గొప్పలకు పోయినా తమ జీవనోపాధుల భద్రత విషయమై ప్రజలు అమితంగా ఆందోళన చెందుతున్నారు. అలాగే తమ భవిష్యత్తు పట్ల యువ భారతీయులు వ్యాకులత అంతా ఇంతా కాదు. ఇవి ఘోర వాస్తవాలని సీజేపీ స్పష్టం చేసింది. సర్వశక్తిమంతమైన ప్రభుత్వం ఒక మీమ్‌ను నిషేధించేందుకు జాతీయ భద్రతను కారణంగా చూడడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి? సామాజిక మాధ్యమాల్లో ఒక విషయమై విశేషంగా వెల్లువెత్తుతున్న అభిప్రాయాలను అపఖ్యాతిపాలు చేసేందుకు ట్రోల్ ఆర్మీ (ప్రజాభిప్రాయాన్ని తారుమారు చేయడానికి రూపొందించబడిన సోషల్ మీడియా ఖాతాల వ్యవస్థీకృత సమూహం)ను మోహరించాల్సిన అవసరమేమిటి? సీజేపీ విషయంలో ఇలా జరిగిందంటే ప్రభుత్వం కనిపిస్తున్నంత బలంగా లేదనే కాదూ? కాకపోతే ఒక మీమ్‌కు భయపడడ మేమిటి? ఎంతగా విజయాలు సాధిస్తుందో అంతగా ఆత్మరక్షణ చేసుకోవల్సిన పరిస్థితులనూ ఎదుర్కొంటున్నదని స్పష్టంగా చెప్పవచ్చు. విచారకరమైన విషయమేమిటంటే పార్లమెంటరీ ప్రతిపక్షం దుస్థితి. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని రాజకీయ అస్త్రంగా ఉపయోగించుకోవడంలో ప్రతిపక్షం పూర్తిగా విఫలమవుతున్నది. సీజేపీకి కొద్ది రోజుల్లోనే ఇంచుమించు రెండున్నర కోట్ల మంది అనుయాయులు సమకూరడమనేది ప్రతిపక్షాలకు ఒక సందేశాన్నిస్తోంది: సంఘటితమై సమైక్యంగా ప్రభావశీల కార్యాచరణకు పూనుకోవాలి. ఇది జరిగినప్పుడు మాత్రమే ప్రజలు ప్రతిపక్షాలను విశ్వసిస్తారు. ఈ వాస్తవాల దృష్ట్యా కాక్రోచ్ జనతా పార్టీ పట్ల మనం ఎలా ప్రతిస్పందించాలి? రాజకీయ నిరాశావాదం, వ్యూహాత్మకంగా విస్మరించడం లేదా సమాదరించడం ఇత్యాది సాధారణ రీతుల్లో కాకుండా ఒక కొత్త దృక్పథంతో ఆ వినూత్న రాజకీయ శక్తిని చూడాలి. సర్వవ్యాప్త నైరాశ్యాన్ని ఎదుర్కోవడానికి అవసరమైన రాజకీయ సంఘీభావానికి ఒక కొత్త వ్యాకరణాన్ని రూపొందించుకోవాలని కవి వినోద్‌కుమార్ శుక్లా (1937--2025) మనకు ఇలా పిలుపునిచ్చారు: 'మేము కలిసి నడిచాము/ మాలో ఎవరికీ ఒకరి గురించి ఒకరికి తెలియదు/ కలిసి నడవడమంటే ఏమిటో మాత్రమే మాకు తెలుసు'. ఇది విప్లవోద్యమ సహచరుల పరస్పర సాన్నిహిత్యం కాదు.. అపరిచితుల సాహచర్యం. ఇది ఉమ్మడి గుర్తింపు అనుబంధం కాదు, ఉమ్మడి బలహీనతలను పంచుకునే మానవీయ చైతన్యశీల బంధం. బొద్దింకలుగా ఉద్యమించిన యువజనులకు మనం తెలియకపోవచ్చు. అయితే మనం చాచిన చేతిని వారు తప్పక గుర్తిస్తారు, అందుకుంటారు. మనకు పరస్పరం పరిచయం లేకపోవచ్చుగానీ మనం కలిసి నడవడం నేర్చుకోవచ్చు. ఈ నిరాశామయ లోకంలో ప్రతికూలతలను అలా కాకుండా ఇంకెలా అధిగమించగలం

# భవిష్యత్తు తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకుందాం

-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్
-గ్రామాలలో చెత్త నిర్వహణ, పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలి..
-వరదల సమయంలో ప్రజలు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి..
-ప్రత్యామ్నాయ పంటల సాగు, సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహించాలి..
-ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై అపోహలను వీడి ప్రజలు సహకరించాలి..
-అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్.ఐ.ఆర్. లక్ష్యం..
-ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామ సభలో పాల్గొన్న జిల్లా కలెక్టర్..




హంసకలం వార్త

భవిష్యత్తు తరాల కోసం మనమందరం పర్యావరణాన్ని కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఖమ్మం రూరల్ మండలం గోళ్లపాడు గ్రామంలోనీ రైతు వేదికలో నిర్వహించిన గ్రామ సభలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజలతో ముఖాముఖి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు సభలు ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే ముఖ్య వేదికలని అన్నారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమంపై సమగ్ర వివరాలు తెలియజేసి, ప్రజలు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. ఇరిగేషన్ శాఖకు సంబంధించిన కాలువల అభివృద్ధి, సాగునీటి పనుల పురోగతిపై గ్రామస్తులతో చర్చించారు. రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల కొరత తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని తెలిపారు. నానో యూరియా వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. పంటల మార్పిడి విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ, వాతావరణ శాఖ అంచనాలను దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటలైన ఆయిల్‌పామ్, కూరగాయలు, పండ్ల తోటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు తక్కువగా ఉన్న నేపథ్యంలో బోర్‌వెల్ సౌకర్యం కలిగిన రైతులు షార్ట్ డ్యూరేషన్ వరి సాగు చేపట్టవచ్చని తెలిపారు. పంటలకు రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. గ్రామాలలో చెత్తను సమర్థవంతంగా నిర్వహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న జనాభా నేపథ్యంలో పర్యావరణ కాలుష్యం పెరుగుతోందని, ప్రస్తుతం స్వచ్ఛమైన తాగునీటి కోసం డబ్బులు చెల్లిస్తున్నామని, భవిష్యత్తులో స్వచ్ఛమైన గాలి కోసం కూడా డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి రాకుండా పర్యావరణ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలు మెరుగైన జీవనం సాగించాలంటే పర్యావరణ పరిరక్షణ అత్యంత ముఖ్యమని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో ఒకేరోజు కుంభవృష్టి తరహా వర్షాలు కురిసి వరదలు సంభవిస్తున్నాయని, అడవుల నరికివేత కారణంగా కోతులు జనావాసాల్లోకి వస్తున్నాయని తెలిపారు. కోతుల సమస్యకు తక్షణ పరిష్కారం లేదని, గ్రామస్థులు తమ జీవన విధానంలో మార్పులు చేసుకుంటేనే శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లాకు సమగ్ర విపత్తు నిర్వహణ ప్రణాళిక సిద్ధం చేయాల్సిన అవసరాన్ని వివరించిన కలెక్టర్, రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లో మురుగు కాల్వల శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి సంరక్షణ చర్యలు, కమ్యూనిటీ సోక్‌పిట్ల నిర్మాణం వంటి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. వరదల సమయంలో ప్రజలు ప్రభుత్వ యంత్రాంగానికి సహకరించి లోతట్టు ప్రాంతాల నుంచి వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలి పోవడం, విద్యుత్ స్తంభాలు, పెద్ద చెట్లు కూలిపోవడం వంటి ఘటనలతో ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందన్నారు. రహదారులు, కల్వర్టులపై వరద నీరు ప్రవహిస్తున్న సమయంలో అధికారుల హెచ్చరికలను పట్టించుకోకుండా ప్రయాణించడం వల్ల ప్రమాదాలు జరుగు తున్నాయని తెలిపారు. ప్రమాదకర పరిస్థితుల్లో సెల్ఫీలు తీసుకోవడం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుందని హెచ్చరించారు. పాతబడిన ఇళ్లలో నివసించే వారు భారీ వర్షాల సమయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలు లేదా ఇతర సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని సూచించారు. వరదల సమయంలో అనవసరంగా బయటకు వెళ్లవద్దని, విపత్కర పరిస్థితుల్లో హీరో అవ్వాలని ప్రయత్నించవద్దని హితవు పలికారు. ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం ద్వారా ఓట్లు తొలగిపోతాయనే ప్రచారం పూర్తిగా అపోహ మాత్రమేనని కలెక్టర్ స్పష్టం చేశారు. స్వాతంత్ర్యం అనంతరం పలుమార్లు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించారని, టరు జాబితా శుద్ధీకరణే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని, మరణించిన వారు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు, డూప్లికేట్ ఓట్లు మాత్రమే తొలగిస్తామని చెప్పారు. అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోరని భరోసా కల్పించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ స్థాయి అధికారులు ఇంటింటికి వెళ్లి మిగిలిన ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు అందజేస్తారని తెలిపారు. ప్రజలు తమ వివరాలను నమోదు చేసి ప్రభుత్వం గుర్తించిన 11 గుర్తింపు పత్రాల్లో ఏదో ఒక దానిని జతచేసి సమర్పించాలని సూచించారు. జూలై 31, 2026న డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్ ఓటరు జాబితా విడుదల చేస్తామని తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు డ్రాఫ్ట్ జాబితాలో ఉందో లేదో పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు. జూలై 1, 1987కు ముందు భారతదేశంలో జన్మించిన వారు తమ స్వీయ గుర్తింపు లేదా జనన ఆధార పత్రాలు సమర్పిస్తే సరిపోతుందని, జూలై 1, 1987 నుంచి డిసెంబర్ 2, 2004 మధ్య జన్మించిన వారు తమ పత్రాలతో పాటు తండ్రి లేదా తల్లి ఎవరి అయినా ఒకరి పత్రం సమర్పించాలని తెలిపారు. డిసెంబర్ 2, 2004 తర్వాత జన్మించిన వారు తండ్రి, తల్లి ఇద్దరి పత్రాలు సమర్పించాల్సి ఉంటుందని వివరించారు. సెప్టెంబర్ 28, 2026 నాటికి అన్ని అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిష్కరించి, అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితా ను విడుదల చేస్తామని జిల్లా కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బి జ్యోతి, ఆత్మ పిడి బి.సరిత, ఏవో ఉమా నగేష్, పశువైద్యులు జగ్గులాల్ సంబంధిత శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ను ఎదుర్కొనే దమ్ములేకనే బీజేపీపై ఆరోపణలు

-మాజీ ఎమ్మెల్యే బిగాలపై అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ ఫైర్

హంసకలం వార్త

అవినీతి, అభివృద్ధిపై కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే దమ్ము లేక మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ తనపై ఆరోపణలు చేస్తున్నారని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల్లో అర్బన్ నియోజకవర్గ ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చిన తర్వాత మాజీ ఎమ్మెల్యే బిగాల నగరానికి ఎప్పుడో ఒకసారి వస్తున్నారన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత అసహనంతో అవగాహన లేకుండా తనపై ఆరోపణలు చేస్తున్నాడని విమర్శించారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లోను 60 స్థానాల్లో ఒకటే సీటును గెలుపొంది, కనీసం ఆ ఒక్క సీటును కూడా కాపాడుకోలేని అసమర్థత నాయకుడు అని ఆరోపించారు. తాను గెలిచిన తర్వాత గతంలో ఉన్న పెండింగ్ పనులపై అధికారులు మంత్రుల దృష్టికి తీసుకెళ్లి వాటిని అభివృద్ధి పరచడానికి కృషి చేస్తున్నానన్నారు. ఇది జీర్ణించుకోలేని బిగాల అనవసర ఆరోపణలు చేస్తున్నారని చెప్పారు. బిగాల పదేళ్లు అధికారంలో ఉన్నా ..అర్బన్ నియోజకవర్గంలో ఒక్క డబుల్ బెడ్ రూమ్ కూడా ఇప్పించలేదని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ప్రశాంత్ రెడ్డి ఉన్నాడని, ఆయనకు రాజీనామా చేయమని ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. అలాగే ప్రతిష్టాత్మకంగా నిర్మించిన టీ హబ్ లో ఒక్క ప్రముఖ కంపెనీ కూడా తీసుకు రాలేదని మరి కేటీఆర్ ని రాజీనామా చేయమని నిలదీశావా అని ప్రశ్నించారు. కేవలం ఆర్థికంగా అభివృద్ధి చెందడానికే పని చేశావే తప్ప..నిజామాబాద్ అభివృద్ధికి కాదని ఎద్దేవా చేశారు. కమిషన్ కరప్షన్ కలెక్షన్ కు అలవాటు పడి పదేళ్లు పాలించాడని విమర్శించారు. ఇటీవల తాను మంత్రులపై ఒత్తిడి తేవడంతో నగరంలో 396 ఇల్లు కేటాయించారన్నారు. అలాగే మరో వారంలో నగర అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ను కలుస్తున్నట్లు తెలిపారు. ఇటీవల నగరంలోని మినీ ట్యాంకుబండ్ పై బిగాల గణేష్ గుప్తా అవగాహన లేకుండా ఆరోపణలు చేస్తున్నాడని చెప్పారు. ట్యాంక్ బండ్ కాంట్రాక్టర్ సమయం ముగియడంతో తాళాలు వేసి వెళ్లారన్నారు. కొత్త కాంట్రాక్టర్ నియమంచాల్సిన బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం, కార్పొరేషన్ పై ఉందన్నారు. అదే మినీ ట్యాంక్ బండ్ పై ఏర్పాటుచేసిన చెట్లలో అవినీతికి పాల్పడ్డ చరిత్ర బిగాలది అన్నారు. నాలుగున్నర వేల ఒక్కో చెట్టును 45 వేలుగా చూయించి దోచుకున్నారన్నారు. అలాగే కార్పొరేషన్ లో ఒక్క మనిషి విధులు నిర్వహించుకున్నా.. 330 మంది పనిచేస్తున్నట్లు రికార్డుల్లో చూయించి నెలకు 50 లక్షలు దోచుకున్నారన్నారు. ఏ శాఖలో అయినా తాను ఒక్కరూపాయి అవినీతి చేసినట్లు నిరూపిస్తే బహిరంగ చర్చకు సిద్ధమని ఎమ్మెల్యే సవాల్ విసిరారు. నగరంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో గల గణపతి ఆలయం ముందుకు తాను వస్తానని చెప్పారు. తన హయాంలో ఒక్క గుంట భూమి కొనుగోలు చేయలేదని, బిగాల మాత్రం ఒక్క గుంట కూడా విడిచిపెట్టలేదన్నారు.అలాగే ఆర్యవైశ్యులు అంటే దానధర్మాలకు ప్రతిక అని, కానీ బిగాల మాత్రం ఇందుకు విరుద్ధంగా ఉన్నాడన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి స్రవంతి రెడ్డి బిజెపి ఫ్లోర్ లీడర్ ప్రమోద్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ జ్యోతి, కార్పొరేటర్లు చింతకాయల రాజేందర్, మఠం పవన్, బంటు ప్రీతి ప్రవీణ్, బొబ్బిలి సువర్ణ వేణుగోపాల్, కల్పే అర్చనా చిరంజీవి, మమత శివ, సీనియర్ నాయకులు న్యాలం రాజు, పుట్ట వీరేందర్, బీజేవైఎం రాష్ట్ర కో కార్యదర్శి విజయ్, ఇల్లెందుల ప్రభాకర్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.




# బాధితులకు 'ముఖ్యమంత్రి సహాయనిధి' అండ

-51 మంది లబ్ధిదారులకు ?16.16 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ..
-ఖమ్మం రూరల్, ఏదులాపురం వాసులకు మంత్రి పొంగులేటి క్యాంపు కార్యాలయంలో అందజేత..

హంసకలం వార్త

ఖమ్మం : వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) కొండంత అండగా నిలుస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి పేర్కొన్నారు. ఖమ్మం శ్రీనగర్ కాలనీలోని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొత్తం 51 మంది లబ్ధిదారులకు రూ. 16,16,500 విలువైన చెక్కులను దయాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. లబ్ధిదారుల్లో ఖమ్మం రూరల్ మండలానికి చెందిన వారు 30 మంది, ఏదులాపురం మున్సిపాలిటీకి చెందిన వారు 21 మంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించడమే



కాకుండా, సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందిస్తూ భరోసా కల్పిస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మద్దినేని బేబీ స్వర్ణకుమారి, ఆయా ప్రాంతాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఈ.వీ.ఎం. గోదాము తనిఖీ

-భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్



హంసకలం వార్త

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు సాధారణ తనిఖీ లో భాగంగా గురువారం రోజున జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈ.వీ.ఎం. లను భద్రపరిచిన గోదామును రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్. ప్రతినెల ఈ.వీ.ఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సి.సి. కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తత తో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు. ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్, రాజకీయ పార్టీ ప్రతినిధులు మరియ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాలు విజయవంతగా పూర్తి చేయాలి

-అదనపు కలెక్టర్ బి.రాజ గౌడ్




హంసకలం వార్త

ప్రజాపాలన ప్రగతిపాలన కార్యక్రమంలో భాగంగా జగిత్యాల మున్సిపల్ పరిధిలో నిర్వహించిన వార్డు సభ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ పాల్గొన్నారు. ప్రజల సమస్యలు, అభివృద్ధి అవసరాలు, సంక్షేమ పథకాల అమలుపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సూచనలు స్వీకరించారు. సమావేశంలో జగిత్యాల మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, కౌన్సిలర్ లతో కలిసి పాల్గొన్న అదనపు కలెక్టర్, ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. అలాగే వార్డు పరిధిలోని మౌలిక వసతులు, పారిశుధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు తదితర అంశాలపై ప్రజలతో చర్చించి, అందిన వినతులు మరియు ఫిర్యాదులను సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల భాగస్వామ్యంతో స్థానిక సమస్యలను గుర్తించి పరిష్కరించడమే వార్డు సభల ముఖ్య ఉద్దేశ్యమని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, వార్డు ప్రజలు మరియు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాతలు కాదు ప్రాణదాతలు: ఎమ్మెల్యే భూపతి రెడ్డి

హంసకలం వార్త



తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా నిజామాబాద్ జిల్లా టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ అధ్యక్షతన నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని ప్రభుత్వ సలహాదారులు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి,నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గురువారం స్థానిక సమీకృత కలెక్టర్ కార్యాలయ సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని రిబ్బన్ కట్ చేసి శిబిరాన్ని ప్రారంభించారు.

-అనంతరం రక్తదానం చేసిన దాతలను అభినందించారు.

ఈ మేరకు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ఒక ప్రాణాన్ని కాపాడడానికి రక్తం ఆవశ్యకతను వివరించారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. రక్తదానం చేసి దాతలు రక్తదాతలు మాత్రమే కాదని ప్రాణదాతలు అని అభివర్ణించారు. అటు టీఎన్జీవో వారు ఉద్యోగుల సమస్యల పై చేపడుతున్న పోరాటాలను అభినందించారు. ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరవేయడంలో అధికారుల పాత్ర కీలకమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిరణ్, రాష్ట్ర గీతా పారిశ్రామిక కార్పొరేషన్ చైర్మన్ శేఖర్ గౌడ్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాయరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు అమృతపూర్ గంగాధర్, ఉమ్మాజి నరేష్, పొలసాని శ్రీనివాస్, మోహన్, శ్యాంసన్, ధర్మాగౌడ్, ఆయా గ్రామాల సర్పంచులు కార్యకర్తలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

హంస కలం వార్త HAMSA KALAM VARTA
శుక్రవారం 05 జూన్ 2026

# ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ సేవలను మెరుగుపరచాలి

**-ఉన్నతాధికారులతో సమీక్షలో ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి..**

హంసకలం వార్త



ఖమ్మం: భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాల్లో బీఎస్ఎన్ఎల్ నెట్‌వర్క్ సేవలను అత్యున్నత ప్రమాణాలతో అందించాలని, మారుమూల ఏజెన్సీ ప్రాంతాల్లో సిగ్నల్ సమస్యలు లేకుండా నిరంతరాయంగా సేవలు అందేలా చూడాలని ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్ లోని తన నివాసంలో టెలికాం విభాగం (డీఓటి), ఏపీఎల్ఎస్ఏ హైదరాబాద్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డి. భాస్కరరావు, అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్ జి. గణేష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ కె.లక్ష్మణ కుమార్ మరియు బిఎస్ఎన్ఎల్ హైదరాబాద్ డిప్యూటీ జనరల్ మేనేజర్ సి. రమణలతో ఆయన సమీక్ష నిర్వహించారు.

**-25 కొత్త టవర్ల ఏర్పాటు ఆవశ్యకత వివరించిన ఎంపీ..**

ఈ సందర్భంగా ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ, ఇటీవల కేంద్ర టెలికాం కార్యదర్శిని కలిసి ఉభయ జిల్లాల్లో ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో కనెక్టివిటీ సమస్యను అధిగమించడానికి 25 నూతన టవర్లు ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు గుర్తు చేశారు. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజన గ్రామాలు, సరిహద్దు గ్రామాల్లో ఫోన్, ఇంటర్నెట్ సేవలు నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో ఉన్న లోపాలను గుర్తించి, సత్వరం చర్యలు తీసుకోవాలని ఎంపీ ఆదేశించారు. ఈ సమావేశంలో అధికారులు టవర్ల ఏర్పాటుకు సంబంధించిన ప్రస్తుత స్థితిగతులు, సాంకేతిక అంశాలను ఎంపీకి వివరించారు.

# చోరీ కేసు ఛేదించిన ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ పోలీసులను అభినందించిన

**-వరంగల్, ఖమ్మం పోలీసు కమిషనర్లు**

హంసకలం వార్త



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కెయుసి పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రైమ్ నెం. 669/2025, 670/2025 మరియు 14/2026 (సెక్షన్ 331(3), 305(a) BNS కింద) కేసులో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ముగ్గురు ఇతర రాష్ట్ర నేరస్థులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన ఖమ్మం సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బందిని, వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. వివరాలలోకి వెళ్ళితే.. ఇటీవల వరంగల్ జిల్లా, కెయుసి పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడిన నిందితులు చోరీ సొత్తుతో ఖమ్మం మీదుగా వెళ్లే రైల్లో పారిపోతున్నట్లు సీసీ టీవీ పుటేజ్ ఆధారంగా గుర్తించిన వరంగల్ జిల్లా పోలీసులు వెంటనే ఖమ్మం జిల్లా పోలీసులకు సమాచారం అందించారు. పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ఆదేశాలతో రంగంలోకి దిగిన ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బంది ప్రయాణికుల్లాగా ఖమ్మంలో రైలు ఎక్కి ప్రతి రైలు భోగిని క్షుణ్ణంగా పరిశీలిస్తూ... రైలు మధిరకు వచ్చే సరికి పశ్చిమ బెంగాల్ కు చెందిన ఎస్ కె . ఫిరోజ్, ఎస్ కె . ఎమిన్, ఎస్ కె .సుఖ్ చంద్ అనే ముగ్గురు నిందుతులను గుర్తించి చాకచక్యంగా పట్టుకొని వరంగల్ జిల్లా పోలీసులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం జిల్లా సెంట్రల్ క్రైమ్ పోలీసులు తక్షణమే స్పందించి అందించిన అమూల్యమైన సహకారానికి వరంగల్ జిల్లా పోలీస్ కమిషనర్ సన్ ప్రిత్ సింగ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ అందించిన ప్రశంస పత్రాన్ని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేతుల మీదుగా సిబ్బందికి గురువారం అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రామానుజం, సిసిఎస్ ఏసీపీ సర్వర్ పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికతోనే వార్డుల సమగ్ర అభివృద్ధి

**-జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

హంసకలం వార్త



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలనఅ ప్రగతి ప్రణాళిక" ద్వారానే పట్టణాల్లోని ప్రతీ వార్డు సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా గురువారం పట్టణంలోని 45వ వార్డు భుక్తాపూర్ కాలనీలో నిర్వహించిన వార్డు సభకు మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష తో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...వార్డుల్లో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు,వీధి దీపాలు, అంతర్గత రహదారులు, పారిశుధ్య సమస్యలను త్వరితగతిన గుర్తించి, వాటి పరిష్కారానికి తగిన ప్రణాళికలతో నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వార్డు ప్రజల అవసరాలకు అనుగుణంగా అధికారులు ప్రగతి ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆయన ప్రజలకు హామీ ఇచ్చారు. మునిసిపల్ చైర్ పర్సన్ మాట్లాడుతూ...ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో స్థానిక ప్రజలు భాగస్వాములు కావాలని,అప్పుడే వార్డులను ఆదర్శవంతంగా తీర్చిదిద్దడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం వేసవి శిక్షణ శిభిరం స్విమ్మింగ్ పోటీలలో రెండవ బహుమతి పొందిన మునిసిపల్ చైర్ పర్సన్ దంపతుల కుమార్తె బండారి అమితకు కలెక్టర్ ప్రశంస పత్రాన్ని అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్,డీఈఓ మాధవి,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, వార్డ్ ప్రత్యేక అధికారి నిహారిక,వివిధ శాఖల జిల్లా అధికారులు,వార్డు ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# భావి తరాలకు నష్టం వాటిల్లకుండా బాధ్యతగా వ్యవహరించాలి

**-గ్రామ సభలో కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు**

హంసకలం వార్త

మన భావి తరాలకు నష్టం జరుగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో వ్యవహరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి హితవు పలికారు. సమాజం కోసం మనం ఏం చేస్తున్నాం అన్నది ప్రతి ఒక్కరు గుర్తెరిగి బాధ్యతతో మెలగాలని సూచించారు. ప్రజా పాలన – – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లాలో గురువారం గ్రామ, వార్డు సభలకు శ్రీకారం చుట్టారు. మోపాల్ మండలం న్యాల్ కల్ లో గ్రామ సచివాలయం ప్రాంగణంలో సర్పంచ్ చంద్రకళ అధ్యక్షతన జరిగిన గ్రామ సభకు కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి సంబంధిత శాఖల అధికారులు గ్రామస్థులకు వివరించడంతో పాటు, ప్రత్యేక ఓటరు సవరణ ప్రక్రియకు సహకరించడం, పంటల మార్పిడి, పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించాల్సిన ఆవశ్యకత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండడం, వర్షపు నీటిని ఒడిసిపట్టడం, భూగర్భజలాల పెంపుదల, తడి–పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడం, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ, ఎల్ నినో ప్రభావంతో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ సూచనలు చేసినందున, తదనుగుణంగా అనుకూలమైన పంటలను ఎంచుకోవాలని రైతులకు హితవు పలికారు. పంట మార్పిడి విధానాలను అవలంభించాలని, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సలహాలు, సూచనలను పాటిస్తూ నాణ్యమైన ఎరువులు, విత్తనాలను వినియోగించాలని





సూచించారు. ఎక్కడైనా నాసిరకం, నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అలాంటి డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. తనిఖీల కోసం పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశామని అన్నారు. కాగా, మోతాదుకు మించి ఎరువులు, క్రిమి సంహారక మందులు వాడవద్దని, పర్యావరణానికి హాని చేకూర్చే విధంగా వరి కొయ్యలకు నిప్పు పెట్టవద్దని రైతులకు సూచించారు. దీనివల్ల కాలుష్యం వ్యాపిస్తూ భావి తరాలకు కూడా నష్టం వాటిల్లుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా చేయడం చట్టరీత్యా నేరమని, బాధ్యులకు రూ. 5వేలు మొదలుకుని రూ. 25వేల వరకు జరిమానా విధించే అవకాశాలు ఉంటాయని సూచించారు. పర్యావరణ సమతుల్యత, పచ్చదనాన్ని పెంపొందించేందుకు గాను విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పారదర్శకమైన ఓటరు జాబితా కోసం కేంద్ర ఎన్నికల సంఘం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియకు సహకరించాలని కలెక్టర్ కోరారు. ఇంటికి వచ్చే బీ.ఎల్.ఓలకు తగిన వివరాలు అందించాలని సూచించారు. చెరువుల శిఖం భూములు ఆక్రమణకు గురి కాకుండా చూడాలని, కబ్జాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. పన్నులను సకాలంలో చెల్లిస్తూ, గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేయాలని హితవు పలికారు. పోలీస్ కమిషనర్ సాయి చైతన్య మాట్లాడుతూ, శాంతి భద్రతల పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తు చేశారు. శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న ప్రాంతాలు సత్వర అభివృద్ధి సాధిస్తాయని అన్నారు. నేరాల నియంత్రణకు ఉపకరిస్తూ, నేరాలు జరిగిన సందర్భాలలో నిందితుల ఆచూకి తెలుసుకునేందుకు ఉపకరించే సీ.సీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలు, దురలవాట్లకు యువత దూరంగా ఉండాలని హితవు పలికారు. రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసుకుని రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం కృషి చేయాలన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, ప్రజలకు భద్రతా కల్పించడానికి పోలీసు శాఖ ఎల్లవేళలా సమాయత్తంగా ఉంటుందని తెలిపారు. గ్రామ సభలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, మండల ప్రత్యేక అధికారి తిరుమల ప్రసాద్, నిజామాబాద్ ఏ.సీ.పీ ప్రకాష్, డీ.ఎల్.పీ.ఓ శ్రీనివాస్, ఎంపీడీఓ రాములు నాయక్, తహసిల్దార్ రేఖ, మండల వ్యవసాయ అధికారి జాదవ్ హీరా, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలి

**-జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**
**-ఎస్ఐఆర్ పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో**
**-పాల్గొన్న జిల్లా కలెక్టర్..**

హంసకలం వార్త

ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు. ఎస్ఐఆర్ కార్యక్రమంపై కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు విలాస్ దుబే, అమృత గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ శిక్షణ కార్యక్రమంలో ఖమ్మం కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ఎన్నికల సంఘం ప్రతినిధులు ఎన్యుమరేషన్ ఫారాల ముద్రణ, పంపిణీ, ఓటర్ల నుంచి స్వీకరించిన ఎన్యుమరేషన్ ఫారాలను డిజిటలైజేషన్ చేయడం, డేటా నమోదు, ధృవీకరణ ప్రక్రియలు,తదితర అంశాలపై అధికారులకు శిక్షణ అందించారు. శిక్షణ అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులతో









మాట్లాడుతూ జిల్లాలో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తయిన వాటిని, సూపర్వైజర్లు మ్యాపింగ్‌ను మరోసారి క్షుణ్ణంగా ధృవీకరించాలని సూచించారు. 2002 ఎస్ఐఆర్ ఓటర్లు, వారి కుటుంబ సభ్యుల వివరాలను తప్పనిసరిగా మ్యాప్ చేసి క్రాస్ వెరిఫికేషన్ నిర్వహించాలని తెలిపారు. ప్రతి అర్హుడైన వ్యక్తికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని, రాజకీయ పార్టీలకు అనుబంధం లేని వాలంటీర్లను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించాలని ఆదేశించారు. మ్యాపింగ్ పూర్తైన అనంతరం మిగిలిన ఓటర్లందరి నుంచి ఎన్యుమరేషన్ ఫారాలను సేకరించాలని తెలిపారు. ఎన్యుమరేషన్ ఫారాల్లో నమోదయ్యే ఎపిక్ (EPIC) నంబర్‌తో పాటు ఇతర వివరాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించి ధృవీకరించాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ల ద్వారా బీఎల్‌వోలకు పూర్తి స్థాయి శిక్షణ అందేలా సూపర్వైజర్లు పర్యవేక్షించాలని, ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన ఫారాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, డీఆర్ఓ, ఆర్డీఓ శ్రీనివాస్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు రాజు, డిటి అన్సారీ, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సంక్షేమాభివృద్దే ప్రభుత్వ లక్ష్యం

**-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

హంసకలం వార్త

ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో ప్రభుత్వం చేపట్టిన గ్రామ/డివిజన్/వార్డు సభలలో భాగంగా గురువారం జిల్లాలోని హాజీపూర్ మండలం రాపల్లి గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన గ్రామసభకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి సాయి వెంకట్ రెడ్డి,మండల విద్యాధికారి తిరుపతి, సర్పంచ్ రామ్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజాపాలన ప్రగతి ప్రణాళి 99 రోజుల కార్యాచరణలో భాగంగా ప్రభుత్వం ఈ నెల 4,6, 8,10 తేదీలలో ప్రత్యేక సభలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. ఈసారి వర్షం తక్కువగా ఉన్నందున తదనుగుణంగా సాగు చేయగల పంటలను రైతులు ఎంపిక చేసుకోవాలని,ఆ దిశగా వ్యవసాయ, విస్తరణ అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు.యూరియా పంపిణీకి సంబంధించి యాప్ లో నమోదు చేయబడిన రైతులు, పంట,సాగు వివరాలకు అనుగుణంగా విడతల వారీగా యూరియా అందించడం జరుగుతుందని తెలిపారు. ఒకే రకమైన పంట సాగు చేయడం వలన భూసారం తగ్గుతుందని,ఈ పరిస్థితిని అధిగమించేందుకు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని,నానో యూరియా,డి ఎ పి, ప్రభుత్వం చేవీకరించబడిన విత్తనాలను మాత్రమే రైతులు వినియోగించాలని తెలిపారు.భూమి రకాన్ని బట్టి దాదాపు పత్తి పంట ఎకరానికి 14 నుండి 15 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, రైతులకు మద్దతు ధర అందించడం జరుగుతుందని తెలిపారు.చిన్న, సన్న కారు రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయల పంటల సాగుపై దృష్టి సారించాలని,పంట సాగుకు ప్రభుత్వం రాయితీ అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకుని లబ్ధి పొందాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం ద్వారా ఈ సంవత్సరం ఇప్పటివరకు ఎలాంటి డెంగ్యూ కేసులు నమోదు కాలేదని,ఇలాగే కొనసాగించినట్లయితే వ్యాధుల నియంత్రణ సులభతరం అవుతుందని తెలిపారు. ప్రతిరోజు తడి,పొడి చెత్తను సేకరించాలని, ఉపయోగపడే వ్యర్థాల ద్వారా కంపోస్టు చేసి రైతులకు అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు.ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం, జనగణన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. సమగ్ర సవరణ కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలని, ఓటరు మ్యాపింగ్ ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు.జన గణన ప్రక్రియలో వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. విద్యావవస్థ బలోపేతం దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా అన్ని ప్రభుత్వ



పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని తెలిపారు.జూనియర్ కళాశాలలలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయడం జరుగుతుందని, ఈ విద్యా సంవత్సరం వార్షిక ఫలితాలలో దాదాపు 98 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం జరిగిందని తెలిపారు.ఈ వేసవిలో ప్రజలకు ఎలాంటి త్రాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తు కార్యాచరణతో చర్యలు తీసు కోవడం జరిగిందని తెలిపారు.వైద్యం, విద్య, మహిళా రక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు అంశాలపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని,ఈ క్రమంలో ప్రజలకు ఎదురయ్యే సమస్యలపై మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల తహసీల్దార్ల దృష్టికి తీసుకురావచ్చని, టోల్ ఫ్రీ నెంబర్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికార యంత్రాంగం సమన్వయంతో పని చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

హంస కలం వార్త
శుక్రవారం 05 జూన్ 2026

# చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్

-సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై కీలక ఆదేశాలు..

-పోలీస్ స్టేషన్ కు వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించిన ఎస్పీ..

హంసకలం వార్త

చంద్రుగొండ పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు గురువారం నాడు ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్ అధికారులు మరియు సిబ్బంది విధుల నిర్వహణ పట్ల బాధ్యతాయుతంగా ఉండాలని, స్టేషన్ రికార్డులను, క్రైమ్ ఫైల్స్ ను పరిశీలించి పలు సూచనలు చేయడం జరిగింది. సిబ్బందితో ఎస్పీ మాట్లాడుతూ వివిధ సమస్యలతో



పోలీస్ స్టేషన్కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. అదేవిధంగా అక్రమ ఇసుక రవాణా, త్రవ్వకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, అక్రమ ఇసుక రవాణా పై ఉక్కు పాదం మోపాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి ఒక్క పోలీస్ అధికారి మరియు స్టేషన్ సిబ్బంది సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించాలని, మారుతున్న కాలానికి అనుగుణంగా డిజిటల్ విధానాలను అలవర్చుకుని ప్రజలకు మెరుగైన సేవలు



అందించాలని పిలుపునిచ్చారు. ఈ తనిఖీలో భాగంగా, స్టేషన్కు వచ్చిన బాధితుల ఫిర్యాదులను స్వయంగా పరిశీలించి, తక్షణమే వారికి న్యాయం జరిగేలా చూడాలని, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పోలీస్ స్టేషన్లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి, సబ్ ఇన్స్పెక్టర్ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డ్లను ఘనంగా సత్కరించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు

హంసకలం వార్త

హోంగార్డ్ ఆర్గనైజేషన్లో ఎన్నో ఏళ్లుగా పనిచేస్తూ ఎనలేని సేవలందించి పదవీ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డులను ఈ రోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్ నందు ఘనంగా సత్కరించారు. 24 సంవత్సరాలు హోంగార్డ్ ఆర్గనైజేషన్ లో తమ సేవలను అందించిన ఇరువురు పి.నరసింహారావు, మహిళ హోంగార్డు ఆర్. రాంబాయి ఈరోజు పదవీ విరమణ పొందడం జరిగింది. పదవీ విరమణ పొందిన ఇద్దరు హోంగార్డ్ లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శాలువాలతో మరియు పూలమాలతో ఘనంగా సత్కరించారు. వీరి అనుభవాలను జిల్లా ఎస్పీతో పంచుకున్నారు, ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదవీ విరమణ పొందిన హోంగార్డు సిబ్బంది తమ శేషజీవితాన్ని కుటుంబ సభ్యులతో కలసి ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. పదవీ విరమణ పొందిన హోంగార్డు సిబ్బందికి ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.తమ దైనందిన కార్యక్రమాలలో వ్యాయామం, యోగా, ధ్యానం వంటి వాటిని అనుసరిస్తూ తమ ఆరోగ్యాల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డిఎస్పి సత్యనారాయణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, హోంగార్డ్ ఆర్గనైజేషన్ రిజర్వ్



ఇన్స్పెక్టర్ నరసింహారావు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు

# అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండండి

-జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్

హంసకలం వార్త

ఆదిలాబాద్ పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నిర్వహించిన కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమంలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రత్యేకతనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా 37 ద్విచక్ర వాహనాలు ఆరు ఆటోలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా 54 మద్యం బాటీలు స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేశారు. ఇద్దరు మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడ్డట్టు వారు తెలిపారు. పోలీస్ జాగిలం"రోమా"తో గంజాయి పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గంజాయి, సైబర్ మోసాలు, ఉద్యోగ అవకాశాలు ,డ్రంక్ అండ్ డ్రైవ్,త్రిబుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్ వంటి వాటిపై



దూరంగా ఉండాలని ఎస్పి ప్రజలకు సూచించారు. హెల్మెట్ ధరించి సురక్షితంగా ఇంటికి చేరాలని ప్రతి కాలనీలో సిసి టీవీ కెమెరాలు ఏర్పాటు చేసి నేర నియంత్రణకు సహకరించాలని ఆయన చెప్పారు. అలాగే ప్రజల భద్రతే పోలీసులకు ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు. అలాగే వారు గుడుంబా నిర్మూలన పై ప్రత్యేక డ్రైవ్ ను నిర్వహించారు. జిల్లాలోని 11 పోలీస్ స్టేషన్ల పరిధిలో 35 ప్రత్యేక



బృందాలు ఆకస్మిక తనిఖీల్లో 25 మందిపై కేసులు నమోదు చేశారు. 32.5 లీటర్ల బెల్లం వాష్,705 లీటర్ల కల్తీ కల్లు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ మద్యం తయారీ విక్రయాలపై చర్యలు కొనసాగిస్తామని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ప్రజలు పోలీసు యంత్రాంగానికి సమాచారాలిచ్చి సహకరించాలని ఆయన కోరారు.

# మజ్జిగ పంపిణీ చేస్తున్న దాతలను అభినందించిన వేముల మార్కండేయులు

హంసకలం వార్త

వేసవికాలంలో బాటసారులు, వివిధ గ్రామాల నుండి వచ్చే ప్రజలు, వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు మరియు ఎండలో అలసిపోయే వారికి దాహం తీర్చేందుకు శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ చేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థలను భారత్ నిర్మాణ వాలంటరీ వేముల మార్కండేయులు అభినందించారు. వడదెబ్బ కారణంగా పలువురు వృద్ధులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమయంలో "మానవ సేవయే మాధవ సేవ" అనే భావనతో ప్రజలకు ఉచితంగా మజ్జిగ అందిస్తూ సేవ చేస్తున్న దాతల సేవాభావం ప్రజలను ఆకట్టుకుంటోందని ఆయన పేర్కొన్నారు. గంగిశెట్టి శ్రీనివాస్, బెజవాడ నాగరాజు, ఉడ్నాల సత్య నారాయణ, డాక్టర్ జింక మహేందర్, చేపూరి నాగరాజు, నంగునూరు శ్రీకాంత్, లయన్ పోకల యాదగిరి, లయన్ సాయి కిషోర్ తదితర దాతలు గత నెల రోజులుగా మజ్జిగ తయారు చేసి గ్రామీణ



ప్రజలకు అందిస్తూ వడదెబ్బ బారిన పడకుండా కాపాడుతున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా చైతన్య స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు, భారత్ నిర్మాణ వాలంటరీ వేముల మార్కండేయులు దాతలకు ప్రత్యేక అభినందనలు, ధన్యవాదాలు మరియు కృతజ్ఞతలు తెలిపారు. "సొంత లాభం కొంత మానుకొని పొరుగువారికి తోడ్పడవోయ్" అని కందుకూరి వీరేశలింగం పంతులు చెప్పినట్లు, సమాజం పట్ల బాధ్యతగా ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో ఆదర్శనీయమని ఆయన అన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు వచ్చి సమాజ సేవలో భాగస్వాములు కావాలని వేముల మార్కండేయులు పిలుపునిచ్చారు.

## ధాన్యం కొనుగోలు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



హంసకలం వార్త

జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో మిగిలి ఉన్న వరి ధాన్యం సేకరణ ప్రక్రియను జాప్యం లేకుండా వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వరి ధాన్యం కొనుగోలు అంశంపై సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో ఇప్పటివరకు జరిగిన ధాన్యం కొనుగోలు పురోగతి,మిగిలి ఉన్న ధాన్యం నిల్వలు, కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ...రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. తక్కువ పరిమాణంలో ధాన్యం మిగిలి ఉన్న కొనుగోలు కేంద్రాల్లో సేకరణను వేగవంతం చేసి,కొనుగోలు ప్రక్రియను పూర్తికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల్లో అందుబాటులో ఉన్న లారీలు,హమాలీలను ధాన్యం నిల్వలు అధికంగా ఉన్న ఇతర కేంద్రాలకు తరలించి వినియోగించుకోవాలని సూచించారు. ధాన్యం సేకరణ, లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియలో ఎటువంటి అంతరాయం కలగకుండా అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, పౌర సరఫరాల శాఖ అధికారులు రాజేందర్, సుధాకర్,డిఆర్డిఓ విజయలక్ష్మి,డీఎం మార్క్ఫెడ్ మహేష్, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, ఉద్యానవన శాఖ అధికారి రమణ, అధికారులు,సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

-జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



హంసకలం వార్త

ధాన్యం కొనుగోలు ప్రక్రియలో భాగంగా కొనుగోలు కేంద్రాల నుండి తరలించిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని నస్పూర్ మండల కేంద్రంలో గల స్టేట్ వేర్ హౌస్ కార్పొరేషన్ గోదామును మండల తహసిల్దార్ సంతోష్ కుమార్ తో కలిసి సందర్శించి ధాన్యం, మొక్కజొన్నల దిగుమతిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం రైతుల వద్ద నుండి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం తరలించడం జరుగుతుందని తెలిపారు. ధాన్యంతో పాటు గోదాములకు వచ్చిన మొక్కజొన్నలను దిగుమతి చేసి నిల్వ చేయాలని నిర్వాహకులకు సూచించారు. హమాలీల పులి వేతనం చెల్లింపులపై పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ తో మాట్లాడి సకాలంలో కూలి డబ్బులు చెల్లింపులు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లు,తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

-అపరెల్ పార్క్,గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలి

-జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్

హంసకలం వార్త



జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళు ,తరలింపుపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్లు, అన్ లోడింగ్, వాహనాలు, ఇతర అంశాలపై పౌర సరఫరాల శాఖ, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ,సహకార శాఖ,మెప్మా, రవాణా శాఖ, వ్యవసాయ శాఖ,తదితర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి గురువారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ,హమాలీల సంఖ్య,గన్ని సంచులు,ఇప్పటివరకు ఎన్ని కొనుగోలు కేంద్రాలు మూసి వేశారు.తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. అపరెల్ పార్క్,గోదాముల్లో ధాన్యానికి అనుగుణంగా హమాలీల సంఖ్యను పెంచాలని సూచించారు. కొనుగోళ్ల ప్రక్రియలో వేగం పెంచాలని ఆదేశించారు. కొనుగోళ్లు తుది దశకు చేరిన కేంద్రాల నుంచి హమాలీలు,వాహనాలను ఇతర కేంద్రాలకు తరలించాలని సూచించారు. ధాన్యానికి అనుగుణంగా ట్రాన్స్ పోర్ట్ కాంట్రాక్టర్లు వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. ప్రణాళిక ప్రకారం ధాన్యం కొనుగోలు, తరలింపు, అన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతంగా చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్ సూచించారు.

## శ్రీలంక చేతిలో వెస్టిండీస్ ఘోర ఓటమి




స్పోర్ట్స్ డెస్క్:

వెస్టిండీస్ పర్యటనను శ్రీలంక జట్టు విజయంతో ప్రారంభించింది. నిన్న(జూన్ 4) కింగ్‌స్టన్ వేదికగా జరిగిన తొలి వన్డేలో కరేబియన్ జట్టుపై 41 పరుగుల తేడాతో శ్రీలంక విజయం సాధించింది. దీంతో లంక జట్టు మూడు వన్డేల సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. శ్రీలంక విజయంలో కుశాల్ మెండిస్ కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడిన శ్రీలంక తొలుత బ్యాటింగ్‌కు దిగింది.లంకేయులు నిర్ణీత 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 303 పరుగుల భారీ స్కోరు సాధించారు. ఓపెనర్ పాతుమ్ నిశాంక(103 బంతుల్లో 79 పరుగులు), కుశాల్ మెండిస్ (62 బంతుల్లో 72 పరుగులు) హాఫ్ సెంచరీలతో సత్తాచాటారు. చరిత్ అసలంక(45), జనిత్ లియాంగే(44) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. కరేబియన్ బౌలర్లలో జైడన్ సీల్స్, మాథ్యూ ఫోర్డ్, రోస్టన్ ఛేజ్ తలా రెండు వికెట్లు సాధించారు. అనంతరం 304 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన వెస్టిండీస్.. 49.2 ఓవర్లలో 262 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ షైహోప్ (56) , గ్రీవ్స్(45) రాణించగా, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. లంక పేసర్ దుష్మంత చమీరా 4 వికెట్లతో విండీస్ పతనాన్ని శాసించాడు. తీక్షణ రెండు, హసరంగ, చరిత్ అసలంక తలో వికెట్ సాధించారు. కుశాల్ మెండిస్‌కు ప్లేయర్ ఆఫ్‌ది మ్యాచ్ అవార్డు దక్కింది. రెండో వన్డే ఇదే వేదికలో జూన్ 7న జరగనుంది.

# రెండు ట్రోఫీలు అందించినా గుర్తింపు లేదు
# క్లార్క్ సంచలన వ్యాఖ్యలు



స్పోర్ట్స్ డెస్క్:

ప్రస్తుతం రాయల్స్ ఛాలెంజర్స్ బెంగళూరు పేరు మార్మోగుతోంది. అందుకు కారణం.. వరుసగా రెండు సార్లు ఐపీఎల్ టైటిళ్లను గెలవడం. 17 ఏళ్ల పాటు ఐపీఎల్ ట్రోఫీని అందుకునేందుకు ఆర్సీబీ ఎంతో కష్టపడింది. ఐపీఎల్ ప్రారంభమైన ప్రతిసారి.. కప్ ఆర్సీబీదే అంటూ వారి అభిమానులు స్లోగన్స్ ఇవ్వడం..చివరకు నిరాశ ఎదురుకావడం జరిగేది. అయితే వారి కలలను నిజం చేస్తూ.. గతేడాది ఆర్సీబీ ఐపీఎల్ విజేతగా అవతరించింది. ఇదే సంతోషం అనుకుంటే.. ఆర్సీబీ వరుసగా రెండోసారి ఈ ఏడాది కూడా ట్రోఫీని గెలిచి.. అభిమానులను సంబరాల్లో ముంచెత్తింది. ఇదే సమయంలో ఆర్సీబీ కెప్టెన్ రజత్ పాటిదార్ రెండు ఐపీఎల్ టైటిళ్లు అందించినా తగిన గుర్తింపు దక్కలేదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా ఇదే అంశాన్ని ప్రస్తావిస్తూ ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ మైఖేల్ క్లార్క్ కీలక వ్యాఖ్యలు చేశాడు. విరాట్ కోహ్లీ జట్టులో ఉండటంతో రజత్ పాటిదార్ గురించి ఎవరూ మాట్లాడటం లేదని తెలిపాడు. మైఖేల్ క్లార్క్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రజత్ పాటిదార్ మరోసారి సత్తా చాటాడు. అతను స్టార్ క్రికెటర్ కాకపోవడం.. కోహ్లీ జట్టులో ఉండటంతో పాటిదార్ గురించి ఎవరూ మాట్లాడటం లేదు. కానీ కెప్టెన్‌గా అతడు ఆటగాళ్ల నుంచి అత్యుత్తమ ప్రదర్శన రాబట్టాడు. అతను వ్యక్తిగతంగా కూడా మంచి ప్రదర్శన ఇచ్చాడు. భారత టీ20 జట్టులో చోటు దక్కేలా అతని గురించి చర్చ జరగాలి' అని మైఖేల్ క్లార్క్ పేర్కొన్నాడు. 'రజత్ పాటిదార్ టీమిండియాకు కెప్టెన్ అవుతాడో లేదో నాకు తెలీదు. కానీ, అతడిలో సారథ్యలో లక్షణాలున్నాయి. మిడిలార్డర్‌లో అద్భుతంగా బ్యాటింగ్ చేస్తాడు. టీ20ల్లో నాలుగో స్థానంలో బ్యాటింగ్ చేయడం అంత సులభం కాదు. ఈ ఐపీఎల్‌లో రాణించిన చాలా మంది ఆటగాళ్లు టీమిండియాలో స్థానం కోసం పోటీ పడుతున్నారు. కానీ రజత్ పాటిదార్‌ను సెలెక్టర్లు తప్పకుండా దృష్టిలో ఉంచుకుంటారని నేను అనుకుంటున్నాను. టీ20ల్లో పాటీదార్ పేరు ముందుండాలి' అని క్లార్క్ సూచించాడు.



# విరాట్ అభిమానులకు షాకింగ్ న్యూస్
# అఫ్గానిస్థాన్‌తో వన్డేలకు దూరం!



స్పోర్ట్స్ డెస్క్:

టీమిండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ బ్లూ జెర్సీ ధరించి ఆడుతుంటే చూడాలని అభిమానులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. త్వరలో అఫ్గానిస్థాన్ తో జరిగే వన్డే సరీస్ లో విరాట్ కనిపిస్తాడని సంతోషంగా ఉన్నారు. ఈ క్రమంలోనే వారిని నిరాశపరిచే వార్త ఒకటి బయటకు వచ్చింది. అఫ్గానిస్థాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు విరాట్ దూరమయ్యే అవకాశం ఉందని సమాచారం. తొడ కండరాల గాయం కారణంగా సిరీస్ నుంచి వైదొలుగుతాడని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.వన్డే ప్రపంచ కప్ 2027 సన్నాహకాల్లో భాగంగా అఫ్గాన్‌తో భారత్ మూడు వన్డేల సిరీస్‌ను ఆడనుంది. ఈనెల 13 నుంచి 20 వరకు మూడు మ్యాచులు జరగనున్నాయి. ఇటీవల ముగిసిన ఐపీఎల్ 2026 విజేతగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు నిలిచింది. ఈ సీజన్‌లో ఆర్సీబీ జట్టులో విరాట్ కోహ్లీ టాప్ స్కోరర్ నిలిచాడు. గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన ఫైనల్‌లోనూ 75 పరుగులతో అజేయంగా నిలిచి ఆర్సీబీని గెలిపించాడు. మరోవైపు తుది పోరు సమయంలో కోహ్లీ తొండ కండరాల నొప్పితో బాధపడటం చూశాం. రెండు సార్లు ఫిజియోతో సపర్యలు చేయించుకొని మరీ చివరివరకూ బ్యాటింగ్ చేశాడు. ఆ సమయంలో విరాట్ కు వచ్చిన నొప్పి చిన్నదేమో అని అందరూ భావించారు. కానీ.. ఇంకా ఆ నొప్పి తగ్గకపోవడంతో అఫ్గాన్ సిరీస్ కు విరాట్ దూరం కావచ్చని బీసీసీఐ వర్గాలు తెలిపాయి.




## హీరో ఫిన్‌కార్ప్ నుంచి కొత్త యాప్.. స్మార్ట్‌ఫోన్‌తో క్షణాల్లో పర్సనల్ లోన్!




ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ హీరో ఫిన్‌కార్ప్, డిజిటల్ లెండింగ్ రంగంలోకి అడుగుపెడుతూ కీలక ప్రకటన చేసింది. వినియోగదారుల తక్షణ ఆర్థిక అవసరాలను తీర్చే లక్ష్యంతో 'హీరో పర్సనల్ లోన్ యాప్' (హీరో డిజిటల్ లెండింగ్ అండ్ యూపీఐ యాప్)ను ఆవిష్కరించింది. కేవలం రుణ సేవలే కాకుండా, యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇతర డిజిటల్ బ్యాంకింగ్ సేవలను ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ యాప్ ప్రత్యేకత అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. అత్యవసర సమయాల్లో వేగంగా, సులభంగా రుణం పొందే ప్రక్రియను ఇది సులభతరం చేస్తుందని పేర్కొంది. ఈ యాప్ ద్వారా వినియోగదారులు తమ స్మార్ట్‌ఫోన్ నుంచే పర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా, దాదాపుగా కాగిత రహిత (మినిమల్ పేపర్‌వర్క్) డిజిటల్ ప్రక్రియను అనుసరించడం ద్వారా దరఖాస్తును నిమిషాల్లో పూర్తి చేయవచ్చని హీరో ఫిన్‌కార్ప్ వివరించింది. దరఖాస్తును పరిశీలించి, ఆమోదం తెలిపిన వెంటనే, రుణ మొత్తాన్ని రియల్ టైమ్‌లో నేరుగా వినియోగదారుడి బ్యాంకు ఖాతాలోకి జమ చేస్తామని కంపెనీ హామీ ఇస్తోంది. ఈ తక్షణ పంపిణీ (ఇన్‌స్టంట్ డిస్‌బర్స్‌మెంట్) ఫీచర్, ప్రస్తుత డిజిటల్ వినియోగదారుల వేగవంతమైన అవసరాలకు అనుగుణంగా రూపొందించినట్లు స్పష్టమవు తోంది.

# గ్యాప్-డౌన్ నష్టాల నుంచి లాభాల్లోకి.. ఒడుదొడుకుల్లో భారత స్టాక్ మార్కెట్ సూచీలు

ముంబై, మే 4:

అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలతో ఇవాళ (గురువారం) భారీ నష్టాలతో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. తర్వాత అద్భుతమైన రీబౌండ్ సాధించాయి. ఉదయం ప్రారంభంలో సెన్సెక్స్ దాదాపు 490 పాయింట్లు, నిఫ్టీ 130 పాయింట్ల వరకు నష్టపోయినప్పటికీ, తక్కువ స్థాయిల దగ్గర లభించిన బలమైన కొనుగోళ్ల మద్దతుతో సూచీలు నష్టాల నుంచి లాభాల్లోకి మళ్లాయి.ఉదయం 10:28 గంటల సమయానికి నిఫ్టీ 50 గత ముగింపు (23,405.60) కంటే 23.40 పాయింట్లు (0.10%) లాభపడి 23,429.00 వద్ద ట్రేడవుతోంది. సెన్సెక్స్ గత ముగింపు (74,346.17) నుంచి 123.51 పాయింట్లు (0.17%) పెరిగి 74,469.68 వద్ద కొనసాగుతోంది. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 97 డాలర్లకు చేరడం కూడా మార్కెట్లపై ఈ ఉదయం ప్రభావం చూపింది. దీంతో మన మార్కెట్లు కూడా ఉదయం 9:15 గంటలకు భారీ నష్టాలతో ట్రేడింగ్‌ను ప్రారంభించాయి. నిఫ్టీ ఒక దశలో 23,247 స్థాయికి పడిపోయింది. నిన్నటి ఐటీ రంగ షేర్ల పతనం తర్వాత, ఈరోజు తక్కువ ధరల వద్ద లార్జ్ క్యాప్ షేర్లలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపారు. ముఖ్యంగా హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ వంటి హెవీవెయిట్ బ్యాంకింగ్ షేర్లు మార్కెట్‌ను నిలబెట్టాయి. నిఫ్టీ తన కీలక సపోర్ట్ లెవెల్ అయిన 23,200 - 23,250 జోన్‌ను విజయవంతంగా డిఫెండ్ చేసుకుని, తిరిగి 23,400 మార్కును అధిగమించగలిగింది. శుక్రవారం (జూన్ 5) రాబోయే ఆర్బీఐ మానిటరీ పాలసీ నిర్ణయాల కంటే ముందే మార్కెట్ ఈ రకమైన రికవరీ సాధించడం విశేషం. అయితే, గం. 11 తర్వాత మళ్లీ సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు లాభనష్టాల మధ్య ఊగిసలాడుతున్నాయి.



## పెద్ది విడుదల.. శ్రీవారి సేవలో హీరోయిన్ జాన్వీ కపూర్

-రామ్ చరణ్ సరసన కనిపించిన జాన్వీ కపూర్

-డైరెక్టర్‌గా బుచ్చిబాబు సానా

-సంప్రదాయబద్ధంగా పట్టుచీరలో శ్రీవారిని దర్శించుకున్న జాన్వీ

-గుడి ముందు సాష్టాంగ నమస్కారం



మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ జంటగా నటించిన సినిమా 'పెద్ది' ఈరోజు థియేటర్లలోకి వచ్చింది. ఈ చిత్రం విడుదల సందర్భంగా కథానాయిక జాన్వీ కపూర్ తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ముదురు రంగు పట్టుచీర కట్టుకుని సంప్రదాయబద్ధంగా కనిపించింది. బంగారు కామన్‌పట్టీ, నెక్లెస్, జుంకాలు, చేతులకు గాజులు ధరించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దర్శనం అనంతరం ఆలయం నుంచి బయటకు వస్తూ ప్రధాన ద్వారం వద్ద శ్రీవారికి సాష్టాంగ నమస్కారం చేసింది. 'పెద్ది' సినిమాకు బుచ్చిబాబు సానా దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో బొమన్ ఇరానీ, శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు కీలక పాత్రల్లో కనిపించారు. ఇందులో రామ్ చరణ్ ఒక క్రాస్‌ఓవర్ అథ్లెట్‌గా కనిపించాడు. అతడు క్రికెట్, కుస్తీ వంటి క్రీడల్లో రాణించే యువకుడిగా అలరించాడు. పల్లెటూరి నేపథ్యంతో సాగే ఈ కథలో ఓ పట్టుదల గల యువకుడు క్రీడా పోటీల ద్వారా ఎలా పైకి వచ్చాడనేది చూపించారు. నిన్న సాయంత్రమే ప్రారంభమైన ప్రీమియర్ షోలతో ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

# నేడు భారత్ లో ధురంధర్-2 ఓటీటీ ప్రీమియర్

-ప్రపంచవ్యాప్తంగా రూ. 1,780 కోట్లు కొల్లగొట్టిన బ్లాక్‌బస్టర్

-జియోహాట్‌స్టార్‌లో 'రా అండ్ అన్‌దేఖా' వెర్షన్‌గా విడుదల

-జూన్ 5 నుంచి అందుబాటులోకి రానున్న పూర్తి సినిమా




బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన స్పై-థ్రిల్లర్ 'దురంధర్: ది రివెంజ్' ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. థియేటర్లలో రికార్డుస్థాయి వసూళ్లు సాధించిన ఈ చిత్రం, ఈరోజు ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ జియోహాట్‌స్టార్‌లో డిజిటల్ ప్రీమియర్‌గా అడుగుపెడుతోంది. 'రా అండ్ అన్‌దేఖా' పేరుతో, థియేటర్లలో లేని అదనపు సన్నివేశాలతో ఈ వెర్షన్‌ను ప్రత్యేకంగా విడుదల చేస్తున్నారు. ఈరోజు సాయంత్రం 7 గంటలకు జియోహాట్‌స్టార్‌లో ఒక ప్రత్యేక డిజిటల్ ప్రీమియర్ ఈవెంట్ జరగనుంది. ఇందులో సినిమా మేకింగ్ వీడియోలు, నటీనటుల ముచ్చట్లను ప్రసారం చేస్తారు. పూర్తి సినిమా మాత్రం జూన్ 5వ తేదీ నుంచి స్ట్రీమింగ్‌కు అందుబాటులో ఉంటుంది. ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. దేశీయంగా రూ. 1,374 కోట్లు, ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ. 1,780 కోట్లకు పైగా వసూలు చేసి ఇటీవలి కాలంలో అతిపెద్ద కమర్షియల్ హిట్‌లలో ఒకటిగా నిలిచింది. 2025లో వచ్చిన 'దురంధర్' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్ అండర్‌కవర్ స్పై హమ్జా అలీ మజారీ పాత్రలో కనిపించారు. ప్రతీకారం తీర్చుకునే క్రమంలో అతను చేసే యాక్షన్ విన్యాసాలు ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. హిందీ, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ భాషల్లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుంది. ఇప్పుడు ఓటీటీలో విడుదలవుతున్న వెర్షన్‌లో థియేటర్లలో తొలగించిన సీన్లు, డైలాగులు, పొడిగించిన యాక్షన్ సన్నివేశాలు ఉంటాయని, ఇది ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుందని చిత్ర బృందం తెలిపింది. సాధారణంగా భారీ బడ్జెట్ చిత్రాలు థియేటర్లలో విడుదలైన 60-70 రోజుల తర్వాత ఓటీటీలోకి వస్తుంటాయి. 'దురంధర్' కూడా అదే పద్ధతిని అనుసరించింది.


# 'పెద్ది' ప్రీమియర్స్ చూస్తూ కాగితాలు చించేసిన ఉపాసన

### రామ్ చరణ్ 'పెద్ది' సినిమా ప్రిమియర్ షోలో సందడి చేసిన ఉపాసన
### అభిమానులతో కలిసి ఈలలు వేస్తూ, కాగితాలు చల్లుతూ సంబరాలు
### కిందపడిన పేపర్లను తీసి మళ్లీ విసురుతూ ఉత్సాహం




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ భార్య ఉపాసన కొణిదెల ఒక అభిమానిలా మారి థియేటర్‌లో సందడి చేశారు. రామ్ చరణ్ నటించిన తాజా చిత్రం 'పెద్ది' ప్రీమియర్ షోలో ఆమె అభిమానులతో కలిసి చేసిన హంగామా ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. జూన్ 3న హైదరాబాద్‌లోని శ్రీరాములు థియేటర్‌లో ఉపాసన సందడి చేశారు. 'పెద్ది' సినిమా ప్రీమియర్ షోను ఉపాసన తన తండ్రితో కలిసి చూశారు. తెరపై రామ్ చరణ్ మాస్ ఎంట్రీ సీన్ రాగానే, అభిమానులతో పాటు ఉపాసన కూడా ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ కాగితపు ముక్కలను గాల్లోకి చల్లారు. అంతేకాకుండా, కిందపడిన కాగితాలను తీసి మళ్లీ చల్లుతూ సంబరాల్లో పూర్తిగా మునిగిపోయారు. భర్త సినిమాకు ఆమె చూపిన ఉత్సాహం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ నటించారు. క్రికెట్, రెజ్లింగ్, రన్నింగ్ వంటి అంశాల నేపథ్యంలో సాగే ఈ చిత్రం నేడు (జూన్ 4న) ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. వృత్తిపరంగా రామ్ చరణ్ సాధిస్తున్న ప్రతి విజయం వెనుక ఉపాసన మద్దతు ఉంటుందని ఈ సంఘటన మరోసారి నిరూపించిందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు.

## 'తెలుగు భాష ఉన్నంత కాలం బాలు గళం వినిపిస్తూనే ఉంటుంది'
## ఎస్పీబీ 80వ జయంతి వేళ చంద్రబాబు భావోద్వేగ పోస్ట్!




"ఆయన మధురమైన గొంతు కోట్ల మంది హృదయాలను గెలుచుకుంది. సంగీత ప్రపంచానికి ఆయనో అభిషేకం లాంటివారు. ఈ విశ్వంలో తెలుగు భాష ఉన్నంత కాలం ఆయన జీవించే ఉంటారు" అంటూ దిగ్గజ గాయకుడు, పద్మవిభూషణ్ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం (SPB)పై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసల జల్లు కురిపించారు. గురువారం (జూన్ 4) ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం 80వ జయంతిని పురస్కరించుకుని సీఎం చంద్రబాబు ఆయనకు హృదయపూర్వక నివాళులర్పించారు. బాలు మన మధ్య భౌతికంగా లేకపోయినప్పటికీ.. ఆయన పాడిన వేలాది పాటలు నిరంతరం ప్రజల గుండెల్లో మారుమోగుతూనే ఉంటాయని ఎక్స్ వేదికగా భావోద్వేగంగా రాసుకొచ్చారు. 1946 జూన్ 4న ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో జన్మించిన ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం.. 2020 సెప్టెంబర్ 25న కొవిడ్-19 అనారోగ్య సమస్యల కారణంగా కన్నుమూసిన సంగతి తెలిసిందే. అభిమానులు ప్రేమగా 'బాలు' అని పిలుచుకునే ఆయన.. సుదీర్ఘ సినీ ప్రస్థానంలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీతో పాటు 16కి పైగా భాషల్లో దాదాపు 40 వేలకు పైగా పాటలు పాడి గిన్నిస్ రికార్డు సృష్టించారు. కేవలం సినిమా పాటలే కాకుండా భక్తి గీతాలు, శాస్త్రీయ సంగీతంలోనూ తనదైన ముద్ర వేసి దక్షిణాది సంస్కృతికి ఐకాన్‌గా మారారు. ప్రేమైనా, విరహమైనా, భక్తి అయినా, ఆఖరికి మరణమైనా.. మనిషి జీవితంలోని ప్రతి భావానికి బాలు తన గళంతో ప్రాణం పోశారు.

# బన్నీ-లోకేశ్ మూవీపై కీలక అప్‌డేట్.. ఊపిరి పీల్చుకున్న ఫ్యాన్స్

-అల్లు అర్జున్-లోకేశ్ కనగరాజ్ కాంబోలో రానున్న AA23 ఆగిపోలేదని వివరణ

-సోషల్ మీడియా పోస్ట్ ద్వారా వదంతులకు చెక్ పెట్టిన రచయిత రత్నకుమార్

-ఈ ప్రాజెక్ట్ కోసం ఎదురుచూస్తున్నానంటూ తన పోస్ట్‌లో వెల్లడి

-షెడ్యూల్ సమస్యల కారణంగా ప్రాజెక్ట్ ఆగిపోయిందంటూ ఇటీవల ప్రచారం



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, ప్రముఖ దర్శకుడు లోకేశ్ కనగరాజ్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా రాబోతున్న పాన్-ఇండియా చిత్రం (AA23) ఆగిపోయిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని రచయిత రత్నకుమార్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం కొనసాగుతోందని, దానిపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఆయన తేల్చిచెప్పారు.లోకేశ్ కనగరాజ్ దర్శకత్వం వహించిన 'విక్రమ్' సినిమా విడుదలై నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జూన్ 3న రత్నకుమార్ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ చేశారు. లోకేశ్ సినిమాటిక్ యూనివర్స్ (LCU)లో భాగమైనందుకు గర్వంగా ఉందని తెలుపుతూ, పోస్ట్ చివర్లో "#AA23 కోసం వేచి ఉండలేను" అని రాసుకొచ్చారు. దీంతో ఈ ప్రాజెక్ట్ పై వస్తున్న పుకార్లకు ఆయన ఒక్క పోస్ట్‌తో చెక్ పెట్టారు. 2026 ప్రారంభంలో ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ అధికారికంగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అనిరుధ్ రవిచందర్ సంగీతంతో వచ్చిన టీజర్ భారీ అంచనాలు క్రియేట్ చేసింది. అయితే, షెడ్యూల్ సమస్యలు లేదా క్రియేటివ్ విభేదాల కారణంగా ఈ సినిమాను పక్కన పెట్టారని ఇటీవల సోషల్ మీడియాలో కొన్ని నిరాధారమైన వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. దీంతో అభిమానుల్లో ఆందోళన నెలకొంది. 'ఖైదీ', 'విక్రమ్', 'లియో' వంటి చిత్రాలకు సహ రచయితగా పనిచేసిన రత్నకుమార్, ఈ సినిమా స్క్రిప్ట్ పనులు జరుగుతున్నాయని గతంలోనే తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఉండే ఈ కథాంశంపై అల్లు అర్జున్ పూర్తి స్వేచ్ఛ ఇచ్చారని పేర్కొన్నారు. తాజా స్పష్టతతో ఈ వదంతులు పూర్తిగా నిరాధారమైనవని ట్రేడ్ వర్గాలు కూడా అంటున్నాయి. 2027లో విడుదల కానున్న ఈ సినిమాపై అంచనాలు మళ్లీ పెరిగాయి. ఈ వార్తతో అల్లు అర్జున్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037,
Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449